తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## వేకువజామున ఉగ్రశ్రీనివాసమూర్తి కటాక్షం

### -వేడుకగా కైశికద్వాదశి ఆస్థానం



తిరుమల,నవంబర్ 2ప్రభాతవార్తప్రతినిధి:
కార్తీకమాసం ఆదివారం వేకువజామున కైశిక ద్వాదశి ఆస్థానం తిరుమల ఆలయంలో వేడుకగా జరిగింది. శ్రీదేవిభూదేవిసమేతుడై ఉగ్రశ్రీనివాసమూర్తి వేకువజామున 4.30గంటల నుండి 5.45 గంటల వరకు భక్తులకు అభయమిచ్చారు. ఏడాదిలో ఒక్కరోజు మాత్రమే సూర్యోదయానికి ముందే ఉగ్రశ్రీనివాసమూర్తి ఆలయం వెలుపలకు వచ్చి దర్శనమివ్వడం విశేషం, ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్, ఆలయ డిప్యూటీ ఈఓ ఎ.లోకనాథం, అధికారుల, అర్చకులు పాల్గొన్నారు.

## సే నో డ్రగ్స్‌పై ర్యాలీ



తిరుపతి రవాణ,నవంబర్ 2ప్రభాతవార్త: మాదకద్రవ్యాల వ్యసనానికి విద్యార్థులు, యువత దూరంకా వాలని తిరుపతి అదనపు ఎస్పీ రవిమనోహరచారి, తుడ ఛైర్మన్ సి,దివాకర్‌రెడ్డి, శాప్స్ ఛైర్మన్ రవి నాయుడు పిలుపు నిచ్చారు. డ్రగ్స్ వ్యసనం విద్యార్థుల జీవితాన్ని, భవిష్యత్తును నాశనం చేస్తుందన్నారు. "సే నో టు డ్రగ్స్"లో భాగంగా ప్రజలకు, యువతకు అవగాహన కల్పిస్తూ ఆదివారం తిరపతినగరంలో పోలీస్‌శాఖ, ఈగిల్‌సెల్ అధికారులు కలసి 5కె రన్ చేపట్టారు. మాదకద్రవ్యాల వినియోగం వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ ర్యాలీలో కార్పొరేటర్లు నరసింహ, నరేంద్ర, గంగమ్మగుడి ఛైర్మన్ మహేశ్‌యాదవ్, యువత,విద్యార్థులు పాల్గొన్నారు.

## రూ.5 కోట్ల విలువైన పిఓబి

# ప్రభుత్వ భూమి దర్జాగా కబ్జా

### కూటమినేతలకు ప్రభుత్వ హెచ్చరిక బోర్డు అంటే లెక్క లేదా?
### రెవెన్యూ సహకారంతో బోర్డులు పీకేస్తున్న నేతలు?



దొరవారిసత్రం, నవంబర్ 2, ప్రభాతవార్త
దొరవారిసత్రం మండలం నెలబల్లి రెవిన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 7లో కోట్లాది విలువ చేసే ప్రభుత్వ భూమి అదే గ్రామానికి చెందిన కొందరు అధికార పార్టీ నాయకులు అక్రమంగా సాగుకు అనువుగా శుక్రవారం పట్టపగలే ట్రాక్టర్ ద్వారా దున్ని చదును చేశారు. ఇంత జరుగుతున్న చర్యలు తీసుకోవాల్సిన రెవిన్యూ అధికారులే నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం అక్రమ దారులపై ఎటువంటి చర్యలు తీసుకోవడం ఆ గ్రామంలోని కొంతమంది ప్రజలు అధికారులపై తీవ్ర ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు. పిఓబి ప్రభుత్వ భూమి నేషనల్ హైవే 16 పక్కన ఉండడం ఈ భూమి విలువ సుమారు ఐదు కోట్లు ఉంటుందని రెవిన్యూ అధికారులే అంచనా వేశారు అని ఆ గ్రామ ప్రజలు తెలియపరిచారు. ఇటీవల అన్ని వార్తాపత్రికలో ప్రభుత్వ భూమి విషయం తెలిసిందే అప్పుడు విషయం తెలుసుకున్న రెవిన్యూ అధికారులు తాసిల్దార్ పోలీసు వారు అక్రమకు గురైన ప్రభుత్వ భూమిలో బోర్డులు ఏర్పాటు చేశారు ఇప్పుడు ఆ బోర్డులు పీకేసి కొంతమంది కబ్జాదారులు ఆ భూమిని దర్జాగా దున్నుకోవడం రెవిన్యూ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరించడం చర్చనీయాంశమైనది. కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమి పలుమార్లు ఆక్రమణకు గురవుతున్న చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ అధికారులు కబ్జాదారులకు సహకరిస్తున్నారని కొందరు ఆరోపిస్తున్నారు.

**- అప్పుడు చర్యలు చేపట్టి ఉంటే?**

నెలపల్లి రెవిన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 7 పిఓబి ఉన్న 5 కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని చట్టప్రకారం చర్యలు తీసుకొని ఉంటే అక్రమ దారులు మళ్లీమళ్లీ రెచ్చిపోయేవారా. ఎన్నిసార్లు గురైన చర్యలు తీసుకోకపోవడం చర్చినియాసంగా మారిందని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి సుమారు 8 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడాలని కొందరు కోరుకుంటున్నారు.

# సక్సెస్

### ఎల్‌విఎం03-ఎం5 రాకెట్ ప్రయోగం విజయవంతం
### - కక్ష్యలోకి జిశాట్7ఆర్



**భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం శ్రీహరికోట నుంచి ఆదివారం ప్రయోగించిన ఎల్‌విఎం03-ఎం5 రాకెట్ ప్రయోగం సూపర్ సక్సెస్ అయింది. శ్రీహరికోటలోని లాంచ్ ప్యాడ్ నుంచి శనివారం 5 గంటల 26 నిమిషాలకు ప్రారంభమైన కౌంట్‌డౌన్ 24 గంటల అనంతరం భారత కాలమానం ప్రకారం సాయంత్రం 5 గంటల 26 నిమిషాలకు ఈ రాకెట్ నిప్పులు చిమ్ముకుంటూ నింగికెగసింది. ఇస్రో బాహుబలి రాకెట్‌గా పేరొందిన ఈ రాకెట్ ద్వారా 4,410 కేజీల బరువు గల భారీ ఉపగ్రహం జిశాట్ 7ఆర్ (సిఎంఎస్03)ను రోదశిలోకి ప్రవేశపెట్టారు.**

సూళ్లూరుపేట, నవంబర్ 2 ప్రభాతవార్త
43.5 మీటర్ల ఎత్తుగల ఎల్‌విఎం03-ఎం5 రాకెట్ కౌంట్‌డౌన్ పూర్తయిన వెంటనే నింగికెగసింది. రెండు స్ట్రాపాన్ బూస్టర్ల ద్వారా తొలి దశ పూర్తయ్యేందుకు 400 టన్నుల ఘన ఇంధనం అవసరమైంది. రెండో దశకు 110 టన్నుల ద్రవ ఇంధనం, మూడో దశకు 25 టన్నుల క్రయో ఇంధనంతో శాస్త్రవేత్తలు నిర్దేశించిన గమ్యస్థానాన్ని చేరుకుంది. గతంలో నాలుగు దశల్లో ఉన్న ఈ ప్రయోగాన్ని ప్రస్తుతం మూడు దశలకు పరిమితం చేశారు. గమ్యస్థానాన్ని చేరుకునేందుకు ఈ రాకెట్ 16 నిమిషాల 29 సెకన్ల సమయం పట్టింది. అనంతరం ఈ రాకెట్ ద్వారా ప్రయోగించిన భారీ ఉపగ్రహం సిఎంఎస్03ని 29 వేల 970 కిలోమీటర్ల దూరంలో జియోసింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టింది. అనంతరం హసన్‌లోని శాటిలైట్ మానిటరింగ్ కేంద్రం నుంచి శాస్త్రవేత్తలు నిర్దేశించిన 36వేల కిలోమీటర్ల ఎత్తులోని కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. రాకెట్ నుంచి ఉపగ్రహం విడిపోయిన తర్వాత ఒక నిమిషం పాటు శాస్త్రవేత్తల్లో నిశ్శబ్దం అలముకుంది. ఇస్రో చరిత్రలో మొట్టమొదటిసారిగా క్రయోజనిక్ ఇంజన్‌ను తిరిగి రీస్టార్ట్ చేయడం ద్వారా నిర్దేశించిన కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. ఎల్‌విఎం సిరీస్‌లో ఇది 8వ ప్రయోగం. పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో జరిగిన ఈ ప్రయోగ విజయంతో భారతదేశం అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానంలో మరోసారి తన సత్తా చాటింది.

## సమష్టి కృషితో సాధించిన విజయం

### - ఇస్రో ఛైర్మన్ నారాయణన్




సూళ్లూరుపేట, నవంబర్ 2 ప్రభాతవార్త
ఎల్‌విఎం3-ఎం5 రాకెట్ ప్రయోగ విజయం ఇస్రోలోని ప్రతి ఒక్కరి సమష్టి కృషితో సాధించినదని ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ వెల్లడించారు. ఆదివారం ఎల్‌విఎం3-ఎం5 రాకెట్ ప్రయోగ విజయం అనంతరం ఆయన ఇస్రో శాస్త్రవేత్తల బృందంతో కలిసి విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. ఎల్‌విఎం సిరీస్‌లో 8వ ప్రయోగం సూపర్ సక్సెస్ అయిందన్నారు. ఇప్పటివరకు అపజయం ఎరుగని బాహుబలి రాకెట్‌గా ఎల్‌విఎం-3 మిషన్‌ను ఆయన అభివర్ణించారు. ప్రయోగానికి వాతావరణం నుంచి కొంత ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పటికీ చివరికి ప్రయోగ విజయానికి అది అడ్డంకి కాలేదని చెప్పారు. ఈ రాకెట్ ద్వారా ప్రయోగించిన సిఎంఎస్03 ఉపగ్రహం సైనిక అవసరాలతో పాటు కమ్యూనికేషన్ రంగాన్ని బలోపేతం చేసేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఈ ఉపగ్రహం 15 సంవత్సరాల పాటు రోదశిలో ఉంటూ సేవలు అందిస్తుందని తెలిపారు. భారతదేశం ప్రతిష్టాత్మకంగా భావించిన ఈ ప్రయోగం సూపర్ సక్సెస్ సాధించి ప్రపంచ అంతరిక్ష రంగంలో మరోసారి సత్తా చాటిందని నారాయణన్ తెలిపారు. ఈ సమావేశంలో షార్ డైరెక్టర్ ఇఎస్ పద్మకుమార్, స్పేస్ క్రాఫ్ట్ డైరెక్టర్ ఎ.రాజేంద్రకుమార్, యుఆర్‌ఎస్‌సి డైరెక్టర్ ఎం.శంకరన్, విఎస్ఎస్‌సి డైరెక్టర్ ఎ.రాజరాజన్, ఎల్‌పిఎస్‌సి డైరెక్టర్ మోహన్, మిషన్ డైరెక్టర్ టివివిక్టర్ జోసఫ్,ఎంఎస్‌డి గ్రూప్‌మేనేజర్ గోపీకృష్ణలు పాల్గొన్నారు.




## కుప్పంలో మరో క్షీర విప్లవం దిశగా ..పాడి రైతులకు అండగా !!



### ఉచితంగా పాడి ఆవులకు 17వేల డోసుల లింగ నిర్ధారిత వీర్యం !!
### ఇప్పటికే రోజుకు 5లక్షల లీటర్ల పాల ఉత్పత్తి ..మున్ముందు మరింత పెరుగుదల !!

కుప్పం, నవంబర్ 2ప్రభాతవార్త
తన సొంత నియోజకవర్గం కుప్పంలో రైతులకు సిఎం చంద్రబాబు నాయుడు అన్ని విధాలా అండగా ఉంటున్నారు. గతంలో కుప్పం ద్వారా దేశానికి తొలిసారిగా ఇజ్రాయిల్ టెక్నాలజీని వ్యవసాయ రంగంలో పరిచయం చేశారు. బిందు,తు పర్ల సేద్యంతో కుప్పం ప్రాంత రైతులు పంటలు అధిక దిగుబడులు సాధించేలా చర్యలు చేపట్టారు. కాగా కుప్పం ప్రాంతంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి తగుచర్యలు తొలుతనుంచి చేపడుతున్నారు. గతంలో మహిళలకు ఆవులను సైతం ఉచితంగా పంపిణీ చేయించారు. తద్వారా కుప్పంలో పాడి రంగం అభివృద్ధికి చర్యలు చేపట్టారు.మరో మారు కుప్పంలో క్షీర విప్లవం తెచ్చేలా చర్యలుచేపట్టారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్(ఆర్‌జిఎం )ద్వారా కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా ఆవులకు లింగ నిర్ధారిత సెమన్ (వీర్యం)లు పశుసంవర్ధక శాఖ ద్వారా వేయిస్తున్నారు.

**ఉచితంగా ఇప్పటికే 17వేల డోసులు :**

కుప్పం ప్రాంతంలో గత మార్చి 31నుంచి అక్టోబర్ 31వరకు రైతులయొక్క పాడి ఆవులకు 17వేల డోసుల లింగ నిర్ధారిత వీర్యాన్ని వేశారు. కుప్పంనియోజకవర్గంలో 34వేల డోసులు టార్గెట్‌గా పెట్టుకున్నారు. ఈసెమన్ ఒక్కో డోసు ధర రూ 1300లు కాగా రైతులకు రూ 2.21కోట్ల రూపాయల మేర ప్రస్తుతానికి లబ్ది కలిగింది. ఈ లెక్కన చూస్తే ఆరె న్నెల్లలోపే ఈ పైలట్ ప్రాజెక్ట్ కుప్పంలో సక్సెస్ అయినట్లే. ఈ సెమన్‌ల ద్వారా ఆవులు ఖచ్చితంగా పేయ దూడలకు జన్మనిస్తాయి. తద్వారా ఆవుల స ంఖ్య మరింత పెరుగుతుంది. కాగా ఆవులకు పూర్తిగా లింగ నిర్ధారిత సెమన్‌లను ఉచితంగా వేయించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**మరింత పెరగనున్న ఆవులు..పాలదిగుబడులు :**

కుప్పం నియోజకవర్గంలో ప్రస్తుతానికి రోజుకు 5లక్షల లీటర్ల పాల ఉత్పత్తి అవుతున్నట్లు పశుసంవర్ధక శాఖ ఎడి రెడ్డి కుమారి 'ప్రభాతవార్త'కు తెలిపారు. తమ లక్ష్యాన్ని త్వరగా పూర్తిచేసేందుకు అన్నిచర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.కాగా ప్రస్తుతంచేపట్టిన పైలట్ ప్రాజెక్ట్ ద్వారా మున్ముందు ఆవుల సంఖ్య పెరగడంతోపాటు పాల దిగుబడులు మరింత పెరగనున్నాయి. కాగా నియోజకవర్గంలో ఉత్పత్తి అయ్యే పాలను వివిధ సంస్థల డెయిరీలు స్థానికంగానే కొనుగోలు చేస్తున్నాయి. ఏదిఏమైనా కుప్పంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి సిఎం చంద్రబాబునాయుడు చూపుతున్న చొరవకు రైతులు సిఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

## లాన్ టెన్నిస్ పోటీలు రసవత్తరం

### క్వార్టర్ ఫైనల్స్ కు చేరిన పోటీలు



శ్రీకాళహస్తి,నవంబర్ 2 ప్రభాతవార్త
శ్రీకాళహస్తిలోని ఎస్‌డికె నగర్‌లోని విక్రమ్ స్పోర్ట్స్ ఆకాడమి మైదానంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి లాన్ టెన్నిస్ పోటీలు ఆదివారం రాత్రి అందిన సమాచారం మేరకు దాదాపు అన్ని టీంలు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి.రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న పోటీలను కాకినాడలో నిర్వహించాల్సి ఉండగా అక్కడ వాతావరణం సహకరించనందువల్ల శ్రీకాళహస్తికి అవకాశం వచ్చింది.మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలను ఆంధ్రప్రదేశ్ స్కూల్‌గేమ్స్ సారధ్యంలో నిర్వహిస్తున్నారు. ఈ పోటీలను శనివారం శాప్ ఛైర్మెన్ రవినాయుడు ప్రారంభించగా రేయింబవళ్ళు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన 300 మంది క్రీడాకారులు ఉత్కంఠతగా పోటీ పడుతున్నారు. ఆదివారం క్వార్టర్ ఫైనల్స్‌కు చేరిన బృందాలు సోమవారం సెమిఫైనల్,ఫైనల్ పోటీలు నిర్వహించనున్నారు. బాలురు బాలికలు అండర్ 14,14,19 సంవత్సరాల లోపు క్రీడాకారులకు పోటీలు జరుగుతున్నాయి. గెలిచిన బృందాలు జాతీయ స్థాయి పోటీలకు హాజరు కావాల్సి ఉంది.ఇక్కడ జరుగుతున్న పోటీల్లో క్రీడాకారులు క్వార్టర్ ఫైనల్స్ పూర్తి చేసుకొని సెమి ఫైన ల్స్‌కు చేరుకున్నారు. స్కూల్ గేమ్స్ కార్యదర్శి కిషోర్ సారధ్యంలో నిర్వహిస్తున్న పోటీలు సజావుగా సాగటానికి విక్రం టెన్నిస్ అకాడమి,రిపబ్లిక్ క్లబ్,క్లాసిక్ టెన్నిస్ ఆకాడమి కోర్టుల్లో పోటీలు నిర్వహిస్తున్నారు.

ఎంఎల్‌ఏ చొరవ:
శ్రీకాళహస్తిలో జరుగుతున్న లాన్ టెన్నిస్ రాష్ట్ర స్థాయి పోటీలకు రాష్ట్రంలోని 13 జిల్లాలనుంచి 300 మంది క్రీడాకారులు హాజరు కాగా వారికి ఏర్పాట్లు,సదుపాయాలను ఎంఎల్‌ఏ బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సహకరించారు. వచ్చిన క్రీడాకారులకు ఎలాంటి లోటు లేకుండా పర్యవేక్షించాలని పార్టీ నాయకులకు దిశ దెశ నిర్దేశం చేసారు. సోమవారంపోటీల్లో ఎవరు టైటిల్ గెలుస్తారనేది ఉత్కంఠతగా మారింది.

## మునిసిపాలిటీలో అభివృద్ధిని అడ్డుకుంటున్న ఎమ్మెల్యే, కమిషనర్

### వైసిపి పాలకవర్గం ఆరోపణ



పుత్తూరు, నవంబరు 2 ప్రభాతవార్త :
ఎమ్మెల్యే భానుప్రకాశ్ ఆదేశాల మేరకు మునిసిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ మునిసిపాలిటీలో జరగాల్సిన అభివృద్ధిని అడ్డుకుంటున్నారని పుత్తూరు మునిసిపాలిటీలో అధికార వైసిపి పాలకవర్గం ఆరోపించింది. ఆదివారం మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఛైర్మన్ ఎ.హరి, వైస్‌ఛైర్మన్‌లు డి.జయప్రకాశ్ (చిట్టి), డి.శంకర్, కౌన్సిలర్లు మాట్లాడారు. గత ఏడు మునిసిపల్ కౌన్సిల్ సమావేశాల్లో మెజార్టీ సభ్యులు ఆమోదించిన 90 లక్షల రూపాయల అభివృద్ధి పనులు అమలు కాకుండా అడ్డుకున్నారని తెలిపారు. మునిసిపాలిటీకి బిపిఎస్. ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా మంజూరైన రెండు కోట్ల రూపాయల నిధులను ప్రజోపయోగ పనులకు వినియోగించాల్సి వుందన్నారు. ఆ నిధులతో తెలుగుదేశం పార్టీ నాయకుల జేబులు నింపే పనులను ఆమోదించాలని పేర్కొంటూ ఆ అంశాన్ని గత సమావేశ ఎజెండాలో పొందుపరిచారని తెలిపారు. అయితే కౌన్సిల్‌లో మెజార్టీ వున్న వైసిపి పాలకవర్గం ఆ దోపిడీని అడ్డుకుందని తెలిపారు. పాతికేళ్ల ప్రజా ప్రతినిధిగా కొనసాగిన దివంగత నేత గాలి ముద్దుకృష్ణమనాయుడు కంటే పదేళ్ల ఎమ్మెల్యేగా, రెండేళ్ల మంత్రిగా వున్న ఆర్.కె.రోజా సుస్థిరమైన అభివృద్ధి చేసి చూపించారని తెలిపారు. మునిసిపల్ కార్యాలయ భవనం, పార్క్, షాదీ మహల్, విద్యుత్ క్రిమేషన్ షెడ్, పాలిటిక్నిక్ కాలేజీ, రెండు అర్బన్ హెల్త్ సెంటర్లతో పాటు అసంపూర్తి జాతీయ రహదారి నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి 2000 కోట్లు మంజూరు చేయించిన ఘనత రోజాకు దక్కుతుందని ప్రశంసించారు. ప్రస్తుత ఎమ్మెల్యే భానుప్రకాశ్ ఎమ్మెల్యే అయిన తర్వాత ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. పుత్తూరు మునిసిపాలిటీలో వైసిపి పాలకవర్గానికి మంచిపేరు వస్తుందనే అక్కసుతో అభివృద్ధిని అడ్డుకుంటున్నారని విమర్శించారు. సమావేశంలో కౌన్సిలర్లు ఏకాంబరం, బాలసుబ్రమణ్యం, బాలాజీ, నాయకులు గాంధి, భరత్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య



పెద్దపంజాణి,నవంబర్ 2 ప్రభాతవార్త
ఇంటర్ చదువుతున్న ఓ బాలిక ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చల్లావారిపల్లి గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. ఈసంఘటనకు సంబంధించి బాలిక త ండ్రి పోలీసులకు ఫిర్యాదుచేసిన మేరకు వివరాలిలా.. తన కుమార్తె లావణ్య (17) పలమనేరులోని ఓ కాలేజ్‌లో ఇంటర్ సెకండియర్ చదువుతోందన్నారు. శనివారం ఆమె కళాశాలకు వెళ్తానని చెప్పి బస్సుఎక్కి వెళ్లిందని అయితే కళాశాలకు తాను వెళ్లలేదనే విషయం తమకు తెలిసిందన్నారు. ఈ నేపథ్యంలో ఇంటికి చేరుకున్న తన కుమార్తెను కళాశాలకు ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించగా సమాధానం చెప్పలేదన్నారు. కళాశాలకు వచ్చి తెలుసుకుంటానని పేర్కొన్నట్లు తెలిపారు.కాగా ఆదివారం ఉదయం మరుగుదొడ్డికి వెళ్లివస్తానని చెప్పి వెళ్లిన తనకుమార్తె సమీపంలోని మునీశ్వరస్వామిగుట్ట వద్ద ఉరేసుకుని ఆత మహత్నాయత్నంకు పాల్పడగా విషయం తెలుసుకుని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారన్నారు. కాగా తన కుమార్తెను ఓ యువకుడు శనివారం కళాశాలకు వెళ్లకుండా తనతోపాటు తీసుకెళ్లినట్లు సమాచారం ఉందన్నారు. ఈవిషయంగా పూర్తి దర్యాప్తుచేయాలని మృతురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## బిసీ రుణాల కోసం లబ్ధిదారుల నిరీక్షణ

చిత్తూరు, నవంబర్ 2 ప్రభాతవార్త:
రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మొదటి ఏడాదిలోనే వెనుకబడిన తరగతుల వారిని ఆర్థికంగా ఆదుకోవడానికి బిసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తామని చెప్పింది. ఈ మేరకు అర్హులైన వారి నుండి దరఖాస్తులను స్వీకరించి, మండల స్థాయి అధికారులు, బ్యాంకర్లతో కలిసి ఇంటర్వ్యూలు నిర్వహించి, లబ్దిదారుల జాబితాను సిద్ధం చేశారు. ఇది జరిగి ఆరు నెలలు పూర్తయ్యింది. అయితే జిల్లాలోని ఏ ఒక్క బ్యాంకు ఇప్పటి వరకు బిసీ కార్పొరేషన్ ద్వారా ఎంపికైన లబ్దిదారులు ఒక్కరికంటే ఒక్కరికి సబ్సిడీ రుణం మంజూరు చేయలేదు. గతంలో ఐదేళ్ళపాటు రాష్ట్రంలో అధికారంలో వున్న వైఎస్‌ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం బిసీల ఆర్థికాభివృద్ధికి ఎలాంటి సబ్సిడీ రుణాలు మంజూరు చేయలేదని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన బిసీలకు సబ్సిడీ రుణాలు మంజూరు చేసి వారికి ఆర్థికంగా భరోసా కల్పిస్తామని ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బిసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు ప్రక్రియను చేపట్టి పూర్తి చేసినప్పటికీ ఇప్పటి వరకు బ్యాంకులు మాత్రం ఒక్క యూనిట్‌ను గ్రౌండింగ్ చేయలేదు. ఇదేమని లబ్దిదారులు బ్యాంకు అధికారులను ప్రశ్నిస్తే తమకు ప్రభుత్వం నుండి సబ్సిడీ రుణాల మంజూరుపై ఎలాంటి ఆదేశాలు లేవని, ప్రభుత్వం నుండి ఉత్తర్వులు అందితే ఈ మేరకు ఎంపిక చేసిన లబ్దిదారులకు రుణాలు గ్రౌండింగ్ చేస్తామని పేర్కొంటున్నారు. బిసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణం కోసం తమ పేరును ఖరారు చేసి అధికారులు బ్యాంకుకు పంపడంతో ఆరు నెలలుగా సబ్సిడీ రుణం కోసం ఎంపికైన లబ్దిదారులు బ్యాంకుల చుట్టూ ప్రదిక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వం ఈ ఏడాది మార్చి నెలలో బిసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల కోసం అర్హులైన వారి నుండి దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ మేరకు మార్చి నెలలోనే నగరం, పట్టణ ప్రాంతాల్లో అయితే మున్సిపల్ కార్యాలయాలు, మండలాల పరిధిలో ఎంపిడిఓ కార్యాలయాల్లో అధికారులు, బ్యాంకర్లు కలిసి దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించి లబ్దిదారులను ఎంపిక చేసింది. ఆపై జిల్లా కేంద్రం చిత్తూరులో ఏప్రిల్ 11వ తేదీ జరిగిన బాబు జగ్జీవన్‌రామ్ జయంతి పురస్కరించుకుని జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు 535 మంది లబ్దిదారులందరికీ కలిపి రూ.11.58 కోట్ల మెగా చెక్కును పంపిణీ చేశారు. బిసీ సబ్సిడీ రుణాలకు సంబంధించి అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి మెగా చెక్కును అందజేయడంతో లబ్దిదారులు అప్పుడే సబ్సిడీ రుణం మంజూరు అయ్యిందని సంబరపడ్డారు. లబ్దిదారులకు మెగా చెక్కులు పంపిణీ చేయడంతో ఇక వారం రోజుల్లో బ్యాంకులు బిసీ సబ్సిడీ రుణాలను మంజూరు ప్రక్రియకు శ్రీకారం చుడుతుందని ఆశలు పెట్టుకున్నారు. అయితే నెల రోజులైనప్పటికీ బ్యాంకుల నుండి బిసీ సబ్సిడీ రుణాల లబ్దిదారులకు ఎలాంటి పిలుపు రాకపోవడంతో తామే వెళ్ళి బ్యాంకుల వద్దకు బిసీ సబ్సిడీ రుణం తమకు మంజూరైందని ఆ రుణంను గ్రౌండింగ్ చేయాలని కోరడానికి వెళితే అక్కడ బ్యాంకు అధికారులు చెప్పిన సమాధానం విని లబ్దిదారులు ఖంగుతినాల్సిన పరిస్థితి ఏర్పడింది. బిసీ సబ్సిడీ రుణాలకు సంబంధించి ప్రభుత్వం అడ్వాన్స్ సబ్సిడీ బ్యాంకులకు విడుదల చేయాల్సివుందని, ప్రభుత్వం నుండి సబ్సిడీ మొత్తం బ్యాంకులకు విడుదలైన అనంతరం ప్రస్తుతం ఎంపిక చేసిన లబ్దిదారులకు బిసీ సబ్సిడీ రుణాలు మంజూరుకు చర్యలు తీసుకుంటామని బ్యాంకర్లు స్పష్టం చేశారు. తమకు ఎప్పుడు రుణం గ్రౌండింగ్ అవుతుంది! అనే విషయాలను తెలుసుకోవడం కోసం బ్యాంకుల చుట్టూ ప్రదిక్షిణలు చేస్తున్నారు.



## కార్తీకదీపం జ్వాలాతోరణంలో పాల్గొనండి



తిరుపతి, నవంబర్ 2ప్రభాతవార్త: కార్తీకమాసం పౌర్ణమివేళ బుధవారం చేపట్టే జ్వాలాతోరణం కార్యక్రమం విజయవంతం చేయాలని,ప్రతి ఒక్కరూ పాల్గొనాలని చిగోరా ఆధ్యాత్మికకేంద్ర వ్యవస్థాపకుడు చిత్రపు హనుమంతరావు పిలుపునిచ్చారు. 5వతేదీ జరిగే కార్తీకదీపం.రమాసహిత సత్యనారాయణ వ్రతంలో ప్రజలు పాల్గోనాలని గోడపత్రికలను ఆదివారం ఆవిష్కరించారు. ఆరోజు సాయంత్రం ఈ కార్యక్రమాలు జరుగుతాయి.సాయంత్రం 5.30గంటలకు జ్వాలా తోరణం, 6.45గంటలకు అఖండ దీపారాథన, సహస్రదీపాలంకరణ, 7గంటలకు సత్యనారాయణవ్రతం, 9గంటలకు పంచహారతి ఉంటుంది. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, జయలక్ష్మి, లక్ష్మీరంగనాథన్, లీలావతి,, శేషగిరిరావు, సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా బాలోత్సవంలో అలరించిన కళ్యాణి పాఠశాల చిన్నారులు



తిరుపతి విద్య, నవంబర్ 2 ప్రభాతవార్త: తిరుపతిలోని ఎస్ జి ఎస్ ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆదివారం తిరుపతి బాలోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది.తిరుపతి బాలోత్సవం పేరిట ఈ ఏడాది నాల్గవ సారి కూడా రెండు రోజుల పిల్లల పండుగ ఘనంగా జరిగాయి. 4 వ బాలోత్సవం నందు 250 పాఠశాలలు 10,000 మంది విద్యార్థులు పాల్గొనగా కళ్యాణి పాఠశాల చంద్రగిరి విద్యార్థులు పత్రికా పఠనములో బహుమతులు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ డిఈఓ కేవీఎన్ కుమార్ చేతుల మీదుగా బహుమతులు పొందారు. వి.గిరిజ (6వ తరగతి) రెండవ స్థానము,వి.గాయత్రి (6వ తరగతి) మూడవ స్థానము,తెలుగు పదకేళి నందు యన్.గెశ్వంత్ (9వ తరగతి) ప్రథమ స్థానము,మట్టితో బొమ్మలు 2 వ స్థానం,కె. తిషిత (5 వ తరగతి ) మట్టీతో బొమ్మలు 3వ స్థానం,గెలుపొందారు.



## కుగ్రామంలో కాటన్ సెర్చ్...

### రికార్డు లేని 18 ద్విచక్ర వాహనాలు స్వాధీనం...

రేణిగుంట నవంబర్2ప్రభాతవార్త

. రేణిగుంట మండలం వెంకటాపురం పంచాయతీ లో కుగ్రామమైన అల్లిమిట్ట నందు జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో అర్బన్ సీఐ జయచంద్ర ఆధ్వర్యంలో ఆదివారం పోలీసులు కార్డన్ సర్చ్ నిర్వహించగా 18 రికార్డు లేని వాహనాలను గుర్తించారు. చిన్న గ్రామంలో పెద్ద సంఖ్యలో రికార్డు లేని వాహనాలు గుర్తించబడటంతో పోలీసులు నివ్వెర పోయారు. దీనిని బట్టి రేణిగుంట మండలం, పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఎన్ని వాహనాలు ఉన్నాయో అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రేణిగుంట మండల పరిసర ప్రాంతాల్లో అనేక పరిశ్రమలు ఉండటంవల్ల ఇతర రాష్ట్రాలకు చెందిన ఎంతోమంది పాపం పొట్టకూటికోసం కూలి పనులకు వస్తున్నారు. వీరిలో నిజమైన కూలీలు ఎవరో, ఆగంతుకులు ఎవరో గుర్తించడం కష్టంగా మారింది. పరిశ్రమలు, కంపెనీల యజమానులు కాంట్రాక్ట్ కార్మికుల నియామక విషయం మ్యాన్ పవర్ సప్లై ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించడంతో ఆధార్ కార్డు ఆధారంగా కార్మికులను పనుల్లోకి చేర్చుకుంటున్నారు. కొంతమంది నిజాయితీ పరులైన కార్మికులు ఉన్నప్పటికీ మరి కొంతమంది దొంగ ఆధార్ కార్డులు సృష్టించుకుని పనుల్లో చేరుతున్నట్లు సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి. పోలీసు అధికారులు కాటన్ సర్చ్ లతోపాటు సరైన వ్యక్తిగత అడ్రస్సులు, దొంగ ఆధార్ కార్డులు సృష్టించుకున్న ఆగంతుకులను గుర్తించాలని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

## చేపల వేట కోసం వెళ్లి వృద్ధుడి మృతి



చౌడేపల్లి నవంబర్ 2 ప్రభాతవార్త చేపల వేట కోసం వెళ్లిన వృద్ధుడు మృతి చెందిన సంఘటన చౌడేపల్లిలో చోటుచేసుకుంది మండలంలోని పంచాయతీ కేంద్రం 29ఏ చింతమాకులపల్లికి చెందిన మునస్వామి (65) వ్యవసాయ కూలీగా జీవిస్తున్నాడు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు నిండుగా ఉండటం చేపలు ఉండడం వల్ల శనివారం రాత్రి చేపల వేట కోసం గ్రామానికి సమీపంలోని మన చెరువుకు వెళ్ళాడు అయితే ఆదివారం ఉదయం అదే చెరువులో శవమై తేలాడు చేపలు పట్టేందుకు వలవేసిన మునుస్వామి వాళ్లకే తగులుకొని మృతి చెందిన విషయాన్ని గుర్తించిన స్థానికులు మృతుడి కుటుంబ సభ్యులకు వివరాలు తెలియజేశారు అనంతరం కుటుంబ సభ్యులు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు

## ఘనంగా ముగిసిన విజిలెన్స్ అవేర్నస్ వీక్ 2025 కార్యక్రమము

తిరుపతి విద్య నవంబర్ 2 ప్రభాత వార్త:



జాతీయ సంస్కృత వర్సిటీలో రమారంజన్ ముఖర్జీ ఆడిటోరియం నందు ఆదివారం విజిలెన్స్ అవేర్నెస్ వీక్ 2025 సమాపన కార్యక్రమము ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిథిగా శ్రీ వెంకటేశ్వర వర్సిటీ భూతపూర్వ కులపతి ప్రొ.సి.హెచ్.అప్పారావు, విశిష్టాతిథిగా తుడా ఛైర్మన్ సి.దివాకర్ రెడ్డి విచ్చేసి విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ప్రొ.జి.యస్.ఆర క్రిష్ణమూర్తి, అకడమిక్ డీన్ ప్రొ.రజనీకాంత్ శుక్ల, ఛీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ప్రొ.సత్యనారాయణాచార్య తో కలిసి అవినీతిని ఏవిధంగా నివారించాలి అనే విషయంపై విద్యార్థులుకు వివరించారు.ఈ సందర్భంగా విశిష్టాతిథిగా తుడా చైనర్మన్ సి.దివాకర్ రెడ్డి మాట్లాడుతూ అవినీతి నిరోధక అవగాహన వారోత్సవం ప్రత్యేకించి సమాజాన్ని ఏవిధంగా అవినీతి రహితంగా నిర్మించా లో,అవినీతి రహిత సమాజ నిర్మాణంలో భారతదేశ వెన్నెముక అయిన యువత పాత్ర విషయాలను వివరించారు. ప్రత్యేకించి యువత అవినీతిని నిర్మూలించడానికి నడుం బిగించాలని,నీతినిజాయితీతో జీవితంలో ప్రతి ఒక్కటిని కష్టపడి సాధించాలని సూచించారు.విద్యార్థులు సమాజం పట్ల గౌరవం కలిగి, అధ్యాపకులను గౌరవిస్తూ,తల్లిదండ్రులను బాధ్యతగా చూస్తూ, ఉత్తమపౌరులుగా ఎదగాలని సూచించారు.అనంతరం ముఖ్యాతిథి ఎస్ వి యు భూతపూర్వ కులపతి ప్రొ.సి.హెచ్ అప్పారావు మాట్లాడుతూ అవినీతి రహిత సమాజాన్ని నిర్మిస్తూ, భావిభారతాన్ని ఉన్నత మార్గంలో నిలపడం యువత యొక్క బాధ్యత అనీ, నీతి నిజాయితీతో ధర్మమార్గంలో ముందుకు వెళ్తూ ఉత్తమపౌరులుగా జీవిస్తూ భారతదేశాన్నిఅభివృద్ధిలో అగ్రగామిగా నిలపడంలో ముందుకు సాగాలనీ, నీతిని, ధర్మాన్ని అనుసరిస్తూ సదా ఉత్తమపౌరులుగా జీవిస్తూ భావిభారతాన్ని నిర్మించాలనీ సూచించారు.వర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొ.జి.యస్.ఆర్ క్రిష్ణమూర్తి మాట్లాడుతూ భారతప్రభుత్వం ఆదేశాలు మేరకు విశ్వవిద్యాలయంలో గత వారం రోజులుగా విజిలెన్స్ అవేర్నెస్ వీక్ - 2025 నిర్వహిస్తూ అవినీతి రహిత సమాజాన్ని నిర్మించడంలో యువత ప్రాతను నొక్కి చెప్పడం జరిగిందని తెలియజేసారు.సంస్కృతంలో చెప్పిన సత్యం వద, ధర్మం చర అనే వాక్యాలను జీవితంలో అన్వయించుకుంటూ, నీతిగా, నిజాయితీగా ఉంటూ ఉత్తమ భారతదేశనిర్మాణాన్నినిర్మిస్తూ ముందుకు సాగాలని వివరించారు. గత వారం రోజులుగా ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించిన కోఆర్డినేటర్స్ డా.ఎ.చారుకేష్, డా.ఎ.శేఖర్ రెడ్డిని అభినందించారు.అనంతరం ఈ వారోత్సవంలో వక్తృత్వ, వ్యాసరచన మొ పోటీలలో నిర్వహించారో అందులోని విజేతలకు వేదికపై ఉన్న అతిథులుచే బహుమతి ప్రధానం చెయ్యడం జరిగినది.వర్సిటీ లోని చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ప్రొ.సత్య నారాయ ణాచార్య, వర్సిటీలోని విభిన్న విభాగాల అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

## కోటి సంతకాల సేకరణకు పరుగులు



శ్రీకాళహస్తి,నవంబర్ 2 ప్రభాతవార్త

రాష్ట్ర వైకాపా నాయకుడు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు స్థానిక శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి తమ పార్టీ నాయకులను వైద్యకళాశాలలను ప్రైవేటుకు అప్పగించటాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం పట్టణంలోని శ్రీరామనగర్ కాలనీలో మాజీ శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి చైర్మెన్ వయ్యాల కృష్ణారెడ్డి సారధ్యంలో కోటి సంతకాల్లో భాగంగా ప్రజలచే సంతకాల సేకరణ చేపట్టారు. కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతూ ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటుకు అప్పగించుటకు ప్రయత్నిస్తుందన్నారు. పారిశ్రామిక వెత్తలకు మేలు చేకూర్చే విధంగా విద్యావ్యవస్థను ధారాదత్తం చేయటానికి ప్రయత్నిస్తున్నారని వివరిస్తూ సంతకాల సేకరణ చేపట్టారు. పిపిపి విధానాన్ని వెంటనే రద్దు చేయాలని వైద్యవిద్యను పేద పిల్లల నుంచి దూరం చేయాలనే యోచనకు స్వస్తి చెప్పాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమాల్లో కృష్ణారెడ్డితో పాటు వైకాపా నాయకులు వెంకటేష్ నాయుడు, నాగరాజు, సుధాకర్‌రెడ్డి, తులసీ రామ్‌రెడ్డి, సుబ్రమణ్యం చందు తదితరులు పాల్గొన్నారు.

## భారతమహిళ క్రికెట్ జట్టు విజయం సాధించాలని పూజలు

తిరుపతి, నవంబర్ 2 ప్రభాతవార్త

భారతమహిళ క్రికెట్ జట్టు ఫైనల్ పోటీల్లో అద్భుతంగా ఆడి విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ పూజలుచేసింది. దక్షిణాఫ్రికాతో తలపడుతున్న భారత మహిళ జట్టుకు అన్ని విధాలా ఆశీస్సులు అందాలని దేవదేవుడ్ని వేడుకున్నారు. ఈసందర్భంగా ఆదివారం ఉదయం ఆలయానికి ఎదురుగా ఉన్న అఖిలాండం వద్ద తుడ ఛైర్మన్ .క్రికెట్ అభిమాని సి.దివాకర్‌రెడ్డి, రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ సంయుక్తకార్యదర్శి విజయ్‌కుమార్, ఉమ్మడిచిత్తూరుజిల్లా కార్యదర్శి సతీష్‌యాదవ్ ,అభిమానులు పాల్గొన్నారు. భారత మహిళ క్రికెట్ జట్టు పట్టుదల, కృషి, క్రమశిక్షణ క్రీడాస్ఫూర్తికి నిదర్శనమన్నారు. మహిళలు ప్రతి రంగంలో అద్భుతంగా ప్రతిభ చాటుతున్నారని అన్నారు. భారత జట్టు విజయం సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు.

## వైఎస్సార్సీపి బలోపేతానికి కృషి చేయాలి



కుప్పం, నవంబర్ 2 ప్రభాతవార్త కుప్పం మున్సిపాలిటీలో వైఎస్సార్సీపి బలోపేతానికి నేతలు, కార్యకర్తలు కృషిచేయాలని వైకాపా మున్సిపల్ అధ్యక్షుడు హఫీజ్ కోరారు. ఆదివారం మున్సిపాలిటీలోని 1,2,3,4,8 వార్డులకు సంబంధించి ఎమ్మెల్సీ భరత్ ఆదేశాలతో నూతన కమిటీల ఎన్నికలను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో కష్టపడే వారికి తగినగుర్తింపు లభిస్తుందన్నారు. కాగా ఒకటో వార్డు అధ్యక్షుడిగా మునెప్ప,రెండో వార్డు అధ్యక్షుడిగా స ంపత్, మూడో వార్డు అధ్యక్షుడిగా ప్రభాకర్, ఎనిమిదోవార్డు అధ్యక్షుడిగా మూర్తిని ఎన్నుకున్నారు.కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మునిరాజు,కౌన్సిలర్లు మోహన్‌రాం, మణి,రాజ్‌కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

## గ్రామాల్లో జనసేన పతాకావిష్కరణ



కుప్పం,నవంబర్ 2 ప్రభాతవార్త జిల్లా జనసేన అధ్యక్షుడు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ డా॥ పసుపులేటి హరిప్రసాద్ ఆదివారం కుప్పంలో పర్యటించారు. కుప్పం మండలం మిట్టపల్లి, గుడుపల్లె మండలం గుండ్లసాగరం, యామనూరు, కనమనపల్లిగ్రామాల్లోఆయన పార్టీజెండాలను ఆవిష్క రించారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో జనసేన కో ఆర్డినేటర్ నరేష్,రెస్కో డైరెక్టర్ అమీర్, పాండు,పవన్ మహేష్,స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

## కుప్పం అభివృద్ధికి సిఎం చంద్రబాబు అహోర్నిశలు కృషి



- ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్

రామకుప్పం, నవంబర్ 2 ప్రభాతవార్త కుప్పంనియోజకవర్గ అభివృద్ధికి సిఎం చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ క ంచర్లశ్రీకాంత్,ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. ఆదివారం బళ్ల, ఆని గానూరు, విజలాపురం,ఉస్సిగానిపల్లిలో జరిగిన పార్టీ సమన్వయ కమిటీ సమావేశాల్లో వారు ప్రసంగించారు. కుప్పం ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటుచేసి స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు సిఎం చొరవ చూపుతున్నారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంకు నేతలు,కార్యకర్తలు ముందుండాలన్నారు. పార్టీకి అండగా నిలిచే కార్యకర్తలకు సముచిత స్థానం తప్పక లభిస్తుందన్నారు. కార్యక్రమంలో నేతలు మునస్వామి, పట్ర నారాయణ, వెంకటరమణ, నరసింహులు, ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి, రామూర్తి,సీతాపతి,చలపతి,చిన్నికృష్ణ,శ్రీనివాసులురెడ్డి, గుర్రప్ప, వెంకటరామగౌడు,సత్యేంద్రశేఖర్, రఫీ, గ ంట్లప్పగౌడు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాలపై కడ ద్వారా కళాజాత



శాంతిపురం,నవంబర్ 2 ప్రభాతవార్త సిఎం చంద్రబాబునాయుడు సొంత నియోజకవర్గం కుప్పంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) ద్వారా కళాజాత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్వర్ణకుప్పం -స్వచ్ఛకుప్పం లక్ష్యంగా నియోజకవర్గంలో అమలవుతున్న పిఎం సూర్య ఘర్, పరిశ్రమలు, హంద్రీ-నీవా, మరుగుదొడ్లు, గోకులం షెడ్ల నిర్మాణం, స్త్రీశక్తి, దీపం తదితర పథకాలపై గ్రామాల్లో కళాజాత కార్యక్రమం ద్వారా కళాకారులుప్రజలకు వివరిస్తున్నారు. వీటితో పాటు లఘుచిత్రాలను కూడా ప్రదర్శిస్తున్నారు. కెనమాకులపల్లి,రాళ్లబూదుగూరు తదితరపంచాయతీల్లో కార్యక్రమం జరిగింది. ఎంపిడిఓ పిఆర్ కుమార్ మాట్లాడుతూ మండలంలో అన్నిగ్రామాల్లో ఈకార్యక్రమాలుచేపడ్తామన్నారు.

## పరమహంసయోగానందలో నృత్యపోటీలు




శాంతిపురం, నవంబర్ 2 ప్రభాతవార్త స్థానిక శ్రీ పరమహంసయోగానంద విద్యాలయంలో బైరెడ్డిపల్లి కళాతరంగిణి సంస్థ అధ్వర్యంలో 177వ నృత్య పోటీలను నిర్వహించారు. వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన విద్యార్థులు నృత్యప్రదర్శన, హాస్యం, పాటలు పాడే పోటీల్లో పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా డా॥ మ యూర్‌నాథ్, మస్తాన్, బాలాజీలు వ్యవహరించారు. విజేతలకు బహుమతులు,సర్టిఫికెట్లు అందించారు. కార్య క్రమంలో ప్రిన్సిపాల్ ఆజాద్ హుసేన్, కళాతరంగిణి వ్యవస్థాపకులు రాజేష్‌బాబు, బాలసుబ్ర మణ్యం, లిఖిత, వీణ,లావణ్య, వనితారాణి,ప్రతాప్,సంపత్, మనోశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా గ్రామ కమిటీలు ఏకగ్రీవం

రామకుప్పం,నవంబర్ 2 ప్రభాతవార్త

వైకాపా గ్రామ కమిటీలను ఆపార్టీ నేతలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మేజర్ పంచాయతీ అధ్యక్షుడిగా మనోహర్‌రెడ్డి, కార్యదరి ్శగా బాబు, యూత్ అధ్యక్షుడిగా భరత్‌కుమార్‌రెడ్డి,సోషియల్ మీడియా కన్వీనర్‌గా జయకుమార్, పెద్దతాండ అధ్యక్షుడిగా సామి నాయక్, కార్యదర్శిగా మురుగనాయక్,యూత్ అధ్యక్షుడిగా గుజ్జునాయక్, సోషియల్ మీడియాకు త్యాగరాజునాయక్‌ను ఎన్నుకున్నారు.కార్యక్రమంలో జడ్పీటిసి నితిన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బాబురెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి,నేతలు బర్కతుల్లా, వంశీరెడ్డి,నారాయణస్వామి,పెనువేలుసింహ,యశ్వంత్‌రెడ్డి,మంజునాథ్‌రెడ్డి, శంకర్, విజయ్ పాల్గొన్నారు.

## వైభవంగా క్షీరాబ్ది ద్వాదశి



పుంగనూరు, నవంబర్ 2 ప్రభాతవార్త కార్తిక మాస ద్వాదశి సందర్భంగా పట్టణంలోని పలు వైష్ణవాలయాలలో క్షీరాబ్ది ద్వాదశి వైభవంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పలు బ్రాహ్మణ కుటుంబీకులు వారి ఇళ్లలోని తులసి కోటను సుందరంగా అలంకరించి తులసి, ఉసిరికలకు కళ్యాణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ మహాలక్ష్మి దేవి అవతరించిన దినోత్సవం కావడంతో పాటు ఉత్తాన ఏకాదశి తర్వాత వచ్చే ద్వాదశి ఎంతో పవిత్రం కావడంతో బృందావన పవిత్రోత్సవం శ్రీ మహాలక్ష్మి శ్రీ మహావిష్ణువుల కళ్యాణ పూజా కార్యక్రమాలకు ముత్తైదువులను పిలిచి వారికి పసుపు కుంకుమ గాజులు చీర, రవికలను నైవేద్యాలను పిండివంటలను అందించారు. పట్టణంలోని వైష్ణవాలయాలలో వైభవంగా పూజలు జరిగాయి.

## మహిళా క్రికెట్ వీక్షించిన బాలికలు



పుంగనూరు, నవంబర్ 2 ప్రభాతవార్త భారత్ సౌత్ ఆఫ్రికాల మధ్య జరిగిన మహిళా క్రికెట్ పోటీలు జిల్లా పరిషత్ బాలికొన్నత పాఠశాల విద్యార్థులు ఆదివారం వీక్షించారు. ఉన్నత పాఠశాలలో విద్యార్థులలో క్రీడా స్ఫూర్తి పెంచేందుకు. దేశం పార్టీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే సభ వేదిక పై డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేశారు.ఇండియా, సౌత్ ఆఫ్రికా ఉమెన్స్ వరల్డ్ కప్ పోటీలను విద్యార్థినులతో పాటు పట్టణానికి చెందిన మహిళలు కూడా వీక్షించారు. కార్యక్రమంలో పట్టణ ఫైమెన్ కమిటీ సభ్యులు సివి రెడ్డి గారు మండల అధ్యక్షులు మాధవ రెడ్డి గారు రాష్ట్ర క్రిస్టియన్ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పోలీసు గిరిబాబు గారు రాజంపేట పార్లమెంట్ ఐటిడిపి ప్రధాన కార్యదర్శి పట్టణ కో క్లస్టర్ ఇంచార్జ్ బి కుమార్ గారు మండల కోక్లస్టర్ ఇంచార్జ్ హరి గారు మరియు కోయూనిట్ ఇంచార్జి సుబ్రహ్మణ్యం గారు మహేంద్ర రాయల్ కృష్ణ బాబు పాల్గొన్నారు.

## బోయకొండలో హలాల్‌పై చర్య తీసుకోండి



పుంగనూరు, నవంబర్ 2 ప్రభాతవార్త బోయకొండలో అన్యమతస్తుడు హలాల్ చేయడంపై భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తూ,అలా చేసిన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా కొంతమంది ఇలా చేస్తున్నారని అటువంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని బోయకొండ కార్య నిర్వహణ అధికారి ఏకాంబరంకు విజ్ఞప్తి చేశారు. బోయకొండ ఈఓ తక్షణమే చర్యలు తీసుకుంటామని ఇంకోసారి ఇలాంటివి పునరావృతం కాకుండా చూస్తామని ఈవో హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. బోయకొండ పరిసర ప్రాంతాల్లో హలాల్ నిషేధం అని ఫ్లెక్స్ బోర్డు పెట్టమని బిజెపి నాయకులు సూచించారు.రెండు రోజుల లోపు ఫ్లెక్స్ బోర్డు పెడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పుంగనూరు నియోజకవర్గ ఇంచార్జి మదాన్ లోకేష్, చౌడేపల్లి మండల అధ్యక్షులు మనోహర్, పుంగనూరు పట్టణ బీజేపీ అధ్యక్షులు యం జగదీష్ రాజు, రొంపిచర్ల మండల అధ్యక్షులు జరిగా నాగరాజ,రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మల్లికా రాణి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ అబ్బా వెంకట రమణ నాయుడు,జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ పెద్దమటం బాబు, సీనియర్ నాయకులు ప్రవీణ్, కుమార్, శేఖర్, సోమల మార్కెట్ యార్డ్ డైరెక్టర్ విశ్వనాథ్ నాయుడు, సోమల మండల అధ్యక్షులు హిమగిరి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## చెరువులో పడి వృద్ధురాలు మృతి



చౌడేపల్లి, నవంబర్ 2 ప్రభాతవార్త ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన చౌడేపల్లి మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని పంచాయతీ కేంద్రం పెద్దకొండామర్రికి చెందిన లక్ష్మమ్మ (75) గ్రామంలోనే ఇంటిం టా యాచకం చేసుకుంటూ పొట్ట గడుపుకుంటూ ఉండేది. అనాధగా ఉన్న ఆమె దాహార్తిని తీర్చు కునేందుకు గ్రామానికి సమీపంలోని ఎగువకుంటలోకి వెళ్ళింది. అక్కడ నీరు తాగుతూ

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## విధులకు గైర్హాజరవుతున్న సచివాలయ ఉద్యోగులు

పూతలపట్టు, నవంబర్ 2 ప్రభాతవార్త పూతలపట్టు మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలలో ఉన్నటువంటి గ్రామ సచివాలయ ఉద్యోగులు విధులకు ఆలస్యంగా రావడం వారికి సర్వసాధారణం అయిపోయింది. మరికొందరైతే ఉదయం 10 గంటలకు రావలసిన ఉద్యోగులు మధ్యాహ్నం రెండు గంటలకు లేదా ఆరోజు సాయంత్రం వచ్చి అటెండెన్స్ రిజిస్టర్ లో సంతకాలు చేసి వెళ్లిపోతున్నారు. దీనితో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలకు ప్రజలు దూరమవుతున్నారు. వీరిని నిలువరించడం కానీ, ప్రజలు ప్రశ్నిస్తే ప్రజలపై అసహనం వ్యక్తం చేయడం, ప్రజలపై ఎదురు తిరిగి మాట్లాడడం చేయడంతో ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితి ప్రజల్లో నెలకొంది. అందువల్ల పూతలపట్టు మండలంలో ఉండే సచివాలయ ఉద్యోగులు సక్రమంగా విధులకు రావాలని ప్రజా కార్యకలాపాలకు ప్రజా సంక్షేమ పథకాలు ప్రజలకు అందజేయాలని కోరుతున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి పాలనను గాడిన పెట్టి ఉద్యోగస్తులలో మార్పు తీసుకురావాలని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## శ్రీ లక్ష్మినరసింహస్వామి సేవలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి



కల్లూరు, నవంబర్ 2, ప్రభాతవార్త పులిచెర్ల మండలం దేవళం పేట శ్రీ లక్ష్మినరసింహస్వామి ఆలయాన్ని ఆదివారం జిల్లా ఉద్యానవన శాక అధికారి మధుసూదన్ రెడ్డి దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. లక్ష్మినరసింస్వామి ఆలయంలో కార్తీకమాసం ద్వాదశి సందర్భంగా విశేష పూజలు చేశారు. ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు పూజలు జరిపి నైవేద్యం సమర్పించి మహా మంగళహారతి గావించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ ప్రధాన అర్చకులు అనంతకుమారాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## సాంకేతిక సమస్యలకు టీచర్లను బాధ్యత చేస్తారా!

- రాష్ట్ర వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ కోశాధికారి వి.రెడ్డిశేఖర్‌రెడ్డి ధ్వజం



చిత్తూరుహెల్త్, నవంబర్ 2 ప్రభాతవార్త: రాష్ట్ర విద్యాశాఖలో ఫేస్ అటెండెన్స్ నమోదులో ఏర్పడుతున్న సాంకేతిక కారణాలకు టీచర్లకు సంజాయిషీలు కోరడం సరికాదని రాష్ట్ర వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ కోశాధికారి వి.రెడ్డిశేఖర్‌రెడ్డి ధ్వజమెత్తారు. ప్రతి ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఉదయం 9.30 గంటలలోపు ముఖ హాజరు వేయాల్సి వుంటుందని, అయితే ఇంటర్నెట్ సిగ్నల్స్ సరిగ్గా లేకపోవడం, సర్వర్ బిజీగా వుండటం వల్ల కొంతమంది ఉపాధ్యాయులు లీప్ యాప్‌లో హాజరు వేయడం ఆలస్యం అవుతుందన్నారు. ఒకే యాప్‌లో అనేక రకాల మాడ్యూళ్ళను పొందుపరచడం వల్ల సాంకేతిక సమస్యలు ఏర్పడుతున్నాయని ఆయన ఆరోపించారు. రాష్ట్ర విద్యాశాఖ సాంకేతిక సమస్యలను పరిష్కరించకుండా, సర్వర్లను ఉన్నతీకరించకుండా ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురి చేసి సంజాయిషీ కోరడం కక్షపూరిత వైఖరికి నిదర్శనమని ఆరోపించారు. అలాగే రాష్ట్ర, జిల్లా విద్యాశాఖ కార్యాలయాల్లో విధులు నిర్వహించే సిబ్బంది ముఖ హాజరును బహిర్గతం చేసే ధైర్యం అధికారులకు వుందా అని ఆయన ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగా కక్ష సాధింపు ధోరణితో ఉపాధ్యాయులకు ఇచ్చిన సంజాయిషీ నోటీసులను సత్వరం రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

- కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, నవంబర్ 2 ప్రభాతవార్త: ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు అందరు పాల్గొని ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను అక్కడికక్కడే పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటారన్నారు. అలాగే నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరై ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు.

## తాయారమ్మ కాలనీకి చెందిన చంద్రబాబుపై పిడి యాక్ట్



చిత్తూరు, నవంబర్ 2 ప్రభాతవార్త: పెద్దపంజాణి మండలం రాయలపేట గ్రామం తాయారమ్మ కాలనీకి చెందిన కె.చంద్రబాబు(33)పై పోలీసులు పిడి యాక్ట్ నమోదు చేశారు. కె.నాగరాజు పలు మార్లు శాంతిభద్రతలకు విఘాతం కల్గించడం, పలు నేర కేసుల్లో పునరావృతంగా పాల్గొంటూ ప్రజల శాంతిభద్రతలకు ముప్పుగా మారడంతో ఈ మేరకు పోలీసులు అతనిపై పిడి యాక్ట్ నమోదు చేశారు. కె.చంద్రబాబుపై 2023 నుండి 2025 సంవత్సరం వరకు పలమనేరు, పెద్దపంజాణి పోలీస్ స్టేషన్లలో మూడు నేర కేసులు నమోదయ్యాయి. అలాగే కె.చంద్రబాబు పలుమార్లు నేరపూరిత కార్యక్రమాల్లో పాల్గొనడం, ఆన్‌లైన్ బెట్టింగ్ ద్వారా యువతను మోసం చేయడం, అలాగే పెద్దపంజాణి, గంగవరం, పలమనేరు, పుంగనూరు, పీలేరు, తిరుపతి, బెంగళూరు ఇతర పట్టణాల్లో యువతను ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ లాబిలోకి దించి వారి వద్ద నుండి కోట్ల రూపాయలను కాజేసి అక్రమాస్తులు కూడగట్టాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకున్న వారు, అప్పుల బాధలు తట్టుకోలేక అనేక మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఆర్థిక, ప్రజా శాంతి భద్రతలకు విఘాతం కల్గించడం వంటి కారణాలతో ఇతనిపై సాధారణ చట్టపరమైన చర్యలు సరిపోకపోవడంతో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుషార్ డూడిల సిఫార్సుల మేరకు పలమనేరు డిఎస్పీ డేగల ప్రభాకర్ ఆదేశాల మేరకు కె.చంద్రబాబుపై పిడి యాక్ట్ కింద నిర్బంధ ఆదేశాలు జారీ చేసి అతనిని కడప సెంట్రల్ జైలుకు తరలించారు. ఎవరైనా ఆన్‌లైన్ బెట్టింగ్ పాల్పడి మోసాలు చేస్తే వారిపై పిడి యాక్ట్ నమోదు చేస్తామని ఎస్పీ తుషార్‌డూడి హెచ్చరించారు.

## వైకాపాది ఫేక్ రాజకీయాలు

- రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్



చిత్తూరుహెల్త్, నవంబర్ 2 ప్రభాతవార్త: రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహ న్‌రెడ్డి ఫేక్ రాజకీయాలు, శవరాజకీయాలు, కులాల మధ్య చిచ్చు పెట్టే రాజకీయాలు చేస్తూ ప్రమాదక రంగా మారారని రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్ అన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాశీబుగ్గ వెంకటేశ్వ రాలయంలో జరిగిన తొక్కిసలాటపై వైఎస్ జగన్ శవరాజకీయాలు చేస్తున్నారన్నారు. దేవుడి దర్శనం కోసం వచ్చి ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని, ఘటన జరిగిన వెంటనే ప్రభుత్వం స్పందించి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి క్యూలైన్లను క్రమబద్దీకరించిందన్నారు. ప్రమాదం జరిగిన గుడి పూర్తిగా ప్రైవేటు నిర్వహణలో నడుస్తోందన్నారు. టెంపుల్ కమిటీ సభ్యులు పోలీసులకు భద్రత కల్పించాలని దరఖాస్తు చేసుకుని వుండి పోలీసులు భద్రత కల్పించకుంటే అప్పుడు విమర్శించాలన్నారు. నెల్లూరు జిల్లాలో ఆర్థిక లావాదేవిలు, వ్యక్తిగత కక్షలతో జరిగిన హత్యను కులాలకు ముడిపెట్టి ప్రజలను రెచ్చగొట్టేలా వైకాపా ప్రవర్తిస్తుందోన్నారు. పాస్టర్ ప్రవీణ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందితే దీనిని సైతం మతానితో ముడిపెట్టారని ఆరోపించారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

- కడ పి.డి. వికాస్ మర్మత్



కుప్పం,నవంబర్ 2ప్రభాతవార్త నియోజకవర్గస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంను సోమవారం కుప్పం మండల కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం 1 గంట దాకా జరిగే ఈకార్యక్రమంలో ప్రజలనుంచి నేరుగా వినతులు స్వీకరించడంతో పాటు ఆయాశాఖలకు సమస్యల పరిష్కారంకై తగు ఆదేశాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. నియోజకవర్గ ప్రజలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మహిళా క్రికెట్ జట్టు గెలుపుకై ఆలయంలో పూజలు



కుప్పం, నవంబర్ 2 ప్రభాతవార్త మహిళా ప్రపంచ కప్ టోర్నీలో భారత మహిళా జట్టు గెలుపు సాధించాలని కోరుతూ ఆదివారం స్థానిక గ్రామదేవత శ్రీ తిరు పతి గంగమ్మ ఆలయంలో ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర కార్యదర్శి గోపీనాథ్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్,కౌన్సిలర్ జాకీర్, లయన్స్‌క్లబ్ సలహాదారు మహేష్, కార్పొరేషన్ డైరెక్టర్ తిరుమగళ్ తదితరులు ప్రత్యేకపూజలు నిర్వహించారు.కడ సభ్యురాలుసుగుణమ్మ, అర్చకులు సోమశేఖరశాస్త్రి,నేతలు శారదమ్మ, బుజ్జి,ఆలయ కమిటీ సభ్యులు ఆనంద్,నరేష్, భరద్వాజ్ పాల్గొన్నారు.

## పెన్షన్ల పంపిణీలో కుప్పం టాప్ : కమిషనర్

కుప్పం, నవంబర్ 2ప్రభాతవార్త



ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో కుప్పం మున్సిపాలిటీ చిత్తూరు జిల్లాలో టాప్‌గా నిలిచిందని మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు తెలిపారు. మున్సిపల్ పరిధిలో 5362 పెన్షన్లకు గాను 5242 పెన్షన్లను శనివారం నాటికి పూర్తి చేశామన్నారు. మిగతా 120మందికి సోమవారం పెన్షన్లు అందిస్తామన్నారు. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల తో ప్రతినెలా 1వతేదిన ఉదయం కల్లా మున్సిపల్ అధికారులు, సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు,స్థానిక నేతల ద్వారా పెన్షన్లను లబ్దిదారులకు సకాలంలో ఇళ్ల వద్దనే అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేసినసిబ్బందికి, మున్సిపల ్ఛైర్మన్,కౌన్సిలర్లు, ఇతరనేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

## తిరుపతిలో వస్త్ర దుకాణంలోచోరీ

**తిరుపతి, నవంబర్ 2(ప్రభాతవార్త):** తాళంవేసిన దుకాణంలో దొంగలు చోరీ చేసుకెళ్ళారు. తిరుపతి నిమ్మకాయలవీధిలో శనివారం రాత్రి దొంగతనం జరిగినట్లు బాధితులు ఈస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిమ్మకాయలవీధిలో లక్ష్మీశ్రీనివాసహోల్‌సేల్ చీరల దుకాణాన్ని పొర్లవీధిలో నివాసముంటున్న ఉదయ్‌కుమార్ వ్యాపారం చేస్తున్నాడు. శనివారం రాత్రి వ్యాపారలావాదేవీలు ముగించుకుని దుకాణాన్ని మూసి తాళం వేసి వెళ్ళారు. ఆదివారం ఉదయం దుకాణం తెరిచేందుకు రాగానేతాళం తొలగించి చోరీచేసినట్లు కనుగొన్నాడు. బాధితుడు ఈస్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈస్ట్ ఎస్ఐ హేమాద్రి సంఘటనాస్థలికి చేరుకుని చోరీ జరిగిన తీరును గమనించారు. దుకాణంలో సిబ్బందికి జీతాలు ఇచ్చేందుకు కౌంటర్‌లో ఉంచిన 40వేల రూపాయలు నగదు దొంగతనం జరిగినట్లు తెలుసుకుని కేసు నమోదు చేశారు. కాగా ఈ చోరీకి సిబ్బందిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి




**శ్రీకాళహస్తి, నవంబర్ 2 ప్రభాతవార్త** ఇప్పటికే సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహా యింపు ఇవ్వాలని ఆదివారం జరిగిన ఏపిటిఎఫ్ సమావేశంలో నాయకులు డిమాండ్‌చేసారు. సమావే శానికి ముఖ్యఅతిధిగా జిల్లా అధ్యక్షులు బి.మురళీకృష్ణ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఉపాధ్యా యులుఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై సుధీర్ఘంగా చర్చించారు. సమావేశం తరువాత జిల్లా అధ్యక్షుడు మురళి మీడియాతో మాట్లాడుతూ నేడు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న జటిలమైన సమస్య టెట్ పరీక్షలు రాయాలనటం అన్నారు. 12వ పిఆర్‌సి కమిషన్‌ను నియమించి 30శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని కోరారు. అంతేకాక ఉపాధ్యాయులకు గతం లో ఇవ్వాల్సిన పిఆర్‌సి బకాయిలు,డిఏ బకాయిలు వెంటనే మంజూరు చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ యాప్‌లతో సతమతమౌతున్న ఉపాధ్యాయుల పని భారాన్ని తగ్గించి ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని డిమాండ్ చేసారు. కాగా జిల్లా కౌన్సిల్ సమావేశం ఈనెల 16న గూడూరులో నిర్వహించుటకు జిల్లా సబ్ కమిటి తీర్మానం చేసిందని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా సబ్‌కమిటి సభ్యులు జానహరి,ఎస్‌కె ఉస్మాన్ బాషా, ఆర్.గోపాల్ ఎస్‌కె,నౌజియా,ఐ.రామసుబ్బయ్య, భువనేశ్వరి, మునస్వామి, ఎస్‌కె చెంచురాజా,టినారాయణ, టి.రామదాసు,ఉదయ్‌కుమార్ రాష్ట్ర పూర్వపు కమిటి కన్వీనర్ జి.సుధార్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర పన్నుల విభాగం డైరెక్టర్



**శ్రీకాళహస్తి, నవంబర్ 2 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వ రాలయంలో వెలసిన వాయులింగేశ్వరుని ఆదివారం కేంద్ర బోర్డు ఆఫ్ టాక్సస్ డైరెక్టర్ మెంబర్ రాజశేఖ ర్‌రెడ్డి కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు.వారికి రాష్ట్రబిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ సారధ్యంలో ఘనస్వాగతం ఏర్పాటు చేసారు.దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ప్రోటో కాల్ ఎఇఓ మోహన్ ఎపిఆర్ఓ రవిల సారధ్యంలో వేదపండితులతో స్వాగతం పలికారు.స్వామి అమ్మవార్ల ఆలయ అంతరాల దర్శనం ఏర్పాటు చేసారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వారికి ఆలయ మర్యాదలతో వేదపండితులతో ఆశీర్వచనాలు,స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలు అందించారు.ఆలయ ఎఇఓలు మోహన్,విద్యాసాగర్‌రెడ్డి, వెంకటస్వామి, రవిలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## రోహిత్‌దంపతులకు శుభాకాంక్షలు



**శ్రీకాళహస్తి, నవంబర్ 2 ప్రభాతవార్త** సినీ నటులు నారారోహిత్ దంపతులకు ఎంజిఎం గ్రూప్ ఛైర్మెన్ గుడ్లూరు మల్లికార్జున్ నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం నూతన దంపతులు రాగా వారిని కలసి వివాహా శుభాకాంక్షలు తెలి పారు. వారికి పూల బొకెను అందించారు. .

## గుర్రప్పను సత్కరించిన ఆర్యవైశ్య సంఘం



**శ్రీకాళహస్తి, నవంబర్ 2 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వ రాలయ ధర్మకర్తల మండలి సభ్యుడుగా ఒరెండవ సారి నియమించబడిన శ్రీకాళహస్తికి చెందిన ఆర్యవైశ్య సమాజానికి చెందిన వాకచర్ల గుర్రప్ప శెట్టిని తిరుపతి ఆర్యవైశ్య సంఘం సారధ్యంలో కార్తీక సంధ్య ఆకాడమి చే ఘనంగా సత్కరించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి సభ్యుడు గా రెండవ సారి ఎన్నికైన గుర్రప్పశెట్టి చిత్తూరుజిల్లా ఆర్యవైశ్య సంఘంలో సభ్యుడుగా ఉన్నారు. గుర్రప్పతో పాటు కాణిపాకం శ్రీవాణి, తలకోన శశికళలను ఆర్యవైశ్య సంఘం సత్కరించారు.ఈ కార్యక్రమాల్లో గౌరవాధ్యక్షులు డి.నరసింహులు, అధ్యక్షులు కె.సురేష్‌ల సారధ్యంలో సత్కరించారు.

## జోగిని అరెస్టు చేస్తే యాగీ ఎందుకు?



**శ్రీకాళహస్తి, నవంబర్ 2 ప్రభాతవార్త** నకిలీ మద్యం తయారి చేసి విక్రయించటం ద్వారా ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వాన్ని భ్రష్టుపట్టించుటకు దానిని రాజకీయానికి వాడుకోవటానికి ప్రయత్నించిన నకిలీ జోషి రమేష్ రోగం కుదుటపడిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్‌రావు తెలుగుదేశం ధ్వజమెత్తారు. వైకాపా పాలనలో నకిలీ మద్యం తయారు చేయించి, దానిని విచ్చల విడిగా విక్రయాలు చేయటం ద్వారా కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకొని వేలాది మంది పేద ప్రజల ప్రాణాలు పోవటానికి కారణం అయిన నకిలి జోగి రమేష్ అరెస్టు కావటం పట్ల నకిలి మద్యం కారణంగా మరణించిన వారి కుటుంబాలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు.నకిలీ మద్యం కేసులో ముందు నుంచి తెలుగుదేశం చెప్పిందే నిజమైందన్నారు.ఈ మీడియా సమావేశంలోవన్నెకుల క్షత్రియ సంఘం అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, తంగేళ్ళ పాలెం సి ంగిల్ విండో అధ్యక్షుడు బీమాల భాస్కర్ ముదిరాజ్ వజ్రం కిషోర్, డివి.నారాయణ, ,కోట చంద్రశేఖర్,మణి, సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

## కోటేశ్వరబాబు ఉదారత



**శ్రీకాళహస్తిరూరల్, నవంబర్ 2 ప్రభాతవార్త** శ్రీకాళ హస్తికి చెందిన సామాజిక వేత్త కోటేశ్వరబాబు ఆదివారం తన ఉదారతను చాటుకున్నారు. శ్రీకాళహస్తిలో భారీ వర్షాలతో కాలనీల్లో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.ఈ దుస్థితిని గుర్తించిన కోటేశ్వరబాబు శ్రీకాళహస్తి మండలం ఎంపేడు పంచాయతీలోని ఈశ్వరయ్య కాలనీలోని షికారి లకు దుప్పట్లు పంపిణీ చేసారు.గ్రామానికి చెందిన శంకరయ్య, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## సాయినామస్మరణతో జీవితం ధన్యం



**తొట్టంబేడు, నవంబర్ 2 ప్రభాతవార్త** సత్యసాయి నామస్మరణతో జీవితం ధన్యమని పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్ అన్నారు. ఆదివారం సత్యసాయి మందిరంలో బాబాభక్త బృందం భజన కార్యక్రమాలు నిర్వహించారు. నేడు మనిషి నిత్యం సమస్యలతో సతమతమౌతున్నారని ఈ దిశలో సాయి భక్త బృందం అందిస్తున్న ఆధ్యాత్మిక చింతన ప్రశాంతతకు నిలయంగా మారిందన్నారు. సాయి భక్తులు తనకు భాగస్వామ్యం కల్పించి తనకు ఎంతో మేలు చేసారన్నారు.ఈ సందర్బంగా సాయి సేవా సమాజం శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో పని చేస్తున్న శానిటరీ కార్మికులకు చీరల అందించారు.ఈ కార్యక్రమాలను తన చేత చేయించటం అభినందనీయం అన్నారు.ఈ కార్యక్రమాల్లో తెలుగుదేశం పార్టీ నాయకుడు కాసరం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్‌లో మహిళ జట్టు విజయం సాధించాలి

-గంగమ్మకు తెలుగుమహిళల పూజలు

**తిరుపతి రవాణ, నవంబర్ 2(ప్రభాతవార్త):** ఐసిసి మహిళ క్రికెట్ పోటీల్లో భారతజట్టు విజయం సాధించి, కప్పును అందుకోవాలని కోరుతూ తాతాయ్య గుంట గంగమ్మ ఆలయంలో తెలు గు మహిళలు పూజలు చేశారు. పార్టీ అధిష్టానం పిలుపుతో తిరుపతిలో ఆదివారం ఉదయం పచ్చదనం సుందరీకరణ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, మహిళలు గంగమ్మకు కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. మహిళ జట్టు విజయం సాధించేలా అమ్మవారి ఆశీస్సులు కలగాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహయాదవ్, డిప్యూటీ మేయర్ మునికృష్ణ, టిడిపి నాయకులు ఊట్ల సురేంద్రనాయుడు, మన్యంశ్రీనివాసులు, రాజారామ్, కోటేశ్వరరావు, తెలుగుమహిళలు బ్యాంకు శాంతమ్మ, అనిత,రేవతి,సూర్యకుమారి, సుజాత,భారతి, యశోధ పాల్గొన్నారు.





## యోగాసనాల పోటీలకు స్పందన



**తిరుపతి కలెక్టరేట్, నవంబర్ 2 ప్రభాతవార్త :** బాలోత్సవ ఉత్సవాలు రెండవ రోజు ఎస్ జి ఎస్ ఆర్ట్స్ కళాశాలలో ఘనంగా జరిగినాయి. ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీ లకు స్పందన లభించింది. ఉయ్ సపోర్ట్ చారి టబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు తహసునీసా బేగం మాట్లాడు తూ పిల్లలకు చిన్న వయసు నుండే ఆరోగ్యం పట్ల అవగాహన అవసరమన్నారు.

## సామిరెడ్డి కండ్రిగల్లో పంచాయతీ భవన నిర్మాణ స్థలం కోసం తర్జన భర్జన

**విజయపురం, నవంబరు 2 ప్రభాతవార్త:** మండలంలోని సామిరెడ్డి కండ్రిగ పంచాయతీ నూతన భవనం నిర్మించడానికి స్థలం కోసం నేతలు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో పాతార్కాడు, సామిరెడ్డి కండ్రిగ పంచాయతీలకు పంచాయతీభవన నిర్మాణం కోసం నిధులు విడుదలైంది. పాతార్కాడు పంచాయతీ భవన నిర్మాణం కోసం స్థల ఎంపిక పూర్తయి భూమిపూజ చేశారు.కానీ సామిరెడ్డి కండ్రిగ పంచాయతీ భవన నిర్మాణం కోసం స్థలం గాలింపు చర్యలు చేపడుతున్నారు. సామిరెడ్డి కండ్రిగ పంచాయతీలో నాలుగు హాబిటేషన్‌లు ఉన్నాయి. గొల్లకండ్రిగ దళితవాడ, గొల్లకండ్రిగ, పన్నూరు సబ్‌స్టేషన్, సామిరెడ్డి కండ్రిగ ప్రాంతాలు ఉన్నాయి. అన్ని ఆవాస ప్రాంతాలకు అనుగుణంగా పన్నూరు సబ్‌స్టేషన్ ప్రాంతంలో పంచాయతీ భవన నిర్మాణం చేపట్టాలని కొందరు నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ విషయమై అధికారులు స్పందించి స్థల పరిశీలన చేసి పంచాయతీ భవన నిర్మాణం చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## కళియంబాకం చెరువు కట్టకు మరమ్మతు చర్యలు



**విజయపురం, నవంబరు 2 ప్రభాతవార్త:** మండలం లోని కళియంబాకంలో చెరువు కట్టకు సాగునీటి సంఘ అధ్యక్షుడు గాలి రమేష్ మరమ్మతు చర్యలు నిర్వహించారు. చెరువు కట్ట బలహీనంగా, లీకేజీ స్థితిలో ఉండడంతో గుర్తించి జేసీబీ, గ్రామస్థులతో మరమ్మతు చర్యలు చేపట్టారు. సాగునీటి సంఘ అధ్యక్షుడు బలహీనంగా ఉన్న చెరువు కట్టను వెంటనే మరమ్మతు చర్యలు నిర్వహించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## తిరుమలను రాజకీయ వేదిక చేయొద్దు....



**రేణిగుంట నవంబర్ 2 ప్రభాతవార్త** ప్రతి చిన్న విషయానికి తిరుమలను రాజకీయ వేదిక చేయొద్దని యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ కార్యదర్శి, బిజెపి యువనేత వెంకటాద్రి యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. తిరుమల శ్రీవారి దేవస్థానంలో జరుగుతున్న ప్రతి చిన్న విషయాన్ని కొంతమంది రాజకీయ నాయకులు రాజకీయ కోణంలో చూడడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. బలాలు ప్రదర్శించుకోవడానికి తిరుమల వేదిక కాదన్నారు. ఎవరు ఏ తప్పు చేసిన శ్రీవారు ఒక కంట కనిపెడుతూ ఉంటారన్నారు. రాజకీయాలు మాట్లాడడానికి చట్టసభలు ఉన్నాయన్నారు. హిందూ మతంపై విశ్వాసం లేని వాళ్ళు , భగవద్గీత, రామాయణ భారతాలపై అవగాహన లేనివాళ్లే అసత్య ప్రచారాలు చేస్తారన్నారు. హిందూ ధర్మంపై విశ్వాసం, శ్రీవారిపై భక్తి ఉన్నవాళ్లను రాజకీయాలకు అతీతంగా పాలకమండలి సభ్యులుగా నియమించాలని డిమాండ్ చేశారు.

## పోలీసులు ప్రోటోకాల్ ఉల్లంఘనపై అసహనం - ఎమ్మెల్యే

**సత్యవేడు, నవంబరు 2 ప్రభాతవార్త:** సత్యవేడు నియోజకవర్గంలో పోలీసులు ప్రోటోకాల్ ఉల్లంఘనపై ఎమ్మెల్యే ఆదిమూలం అసహనం వ్యక్తం చేశారు. ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడు తూ తాను 50 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉన్న రాజకీయ నాయకుడని, తాను ఎమ్మెల్యేగా ఉన్న సత్యవేడు నియోజకవర్గంలో ఎలాంటి ప్రోటోకాల్ లేని వ్యక్తులకు ఎస్కార్టులుగా జీపులతో ప్రోటోకాల్ డ్యూటీ చేయడం ఏంటని ఎమ్మెల్యే ప్రశ్నించారు. తాను ఒక ఎమ్మెల్యేగా మండలాల్లో పర్యటిస్తే కనీసం ఒక ఎస్ఐ కూడా రావడం లేదని, జీపు రిపేరు అంటూ సాకులు చెబుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాగే కొనసాగితే తనకు ఎలాంటి పోలీసు ప్రోటోకాల్ అవసరం లేదని ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు.ఈవిషయాన్నిజిల్లాఎస్పీకి,పుత్తూరుడీఎస్పీకిఫిర్యాదు చేశానని, వారు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. పోలీసు వ్యవస్థపై తనకు అపార గౌరం ఉందని ఆయన స్పష్టం చేశారు.

## మహిళల క్రికెట్ పోటీలకు టిడిపి లైవ్ స్క్రీన్



**చంద్రగిరి, నవంబర్ 2 ప్రభాతవార్త:** భారత్ దక్షిణాఫ్రి కా మహిళల ప్రపంచ కప్ క్రికెట్ ఫైనల్స్‌ను క్రీడాభి మానులు ప్రత్యక్షంగా వీక్షించేందుకు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఏజి పల్లి బాల ఆధ్వర్యంలో ఆదివారం టవర్ క్లాక్ వద్ద లైవ్ స్క్రీన్, సౌండ్స్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. ఎంఎల్ఏ పులివర్తి నాని ఆదేశాల మేరకు టిడిపి మండల నాయకులు హాజరై భారత మహిళా క్రికెటర్లకు, క్రీడాభిమానులకు మద్దతునిస్తూ ప్రత్యక్ష మ్యాచ్‌ను వీక్షించారు. పట్టణంలోని క్రీడాభిమానులు టవర్ క్లాక్ వద్దకు చేరుకుని మ్యాచ్‌ను యంజాయ్ చేశారు. భారత్ దక్షిణాఫ్రికా మహిళల ప్రపంచ కప్ క్రికెట్ ఫైనల్స్‌లో భారత్ ఘన విజయం సాధించాలని ఎంఎల్ఏ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ గౌస్‌భాషా, సింగిల్ విండో ఛైర్మన్ రాజులగారి వినోద్‌కుమార్ రెడ్డి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొందూరు ప్రవీణ్ రాయల్, టిడిపి పట్టణ అధ్యక్షుడు సక్కుర్ ధనంజయ రెడ్డి, నాయకులు మేడసాని కుమార్, రమేష్, సునీత, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యుల వనమహోత్సవం



కార్తీక స ంధ్య అకాడమి సాంస్కృతిక సంబరాలు

**చంద్రగిరి, నవంబర్ 2 ప్రభాతవార్త:** తిరుపతి ఆర్యవైశ్యుల వనమహోత్సవం ఆదివారం ముక్కోటి వద్ద గల నారాయణీ గార్డెన్స్ ఆర్యవైశ్య కుటుంబ సభ్యులతో ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా ఉదయం 9 గంటలకు నెల్లిచెట్టుకు పూజతో కార్యక్రమాలను ప్రారంభించారు. 10.30 గంటల నుండి సాంస్కృతిక కార్యక్రమాలను , ఆటల పోటీలను నిర్వహించారు. మధ్యాహ్నం వన విందు భోజనం, ఆటల పోటీలతో అలరించారు. సాయంత్రం 5 గంటలకు గోల్డ్‌కాయిన్ డ్రా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కొండపల్లి సురేష్, కార్యదర్శి సూరె.శ్యామ్‌సుందర్, గౌరవ అధ్యక్షుడు దిండుకుర్తి నరశింహులు, కోశాధికారి చేవూరి మధుసూదన్ రావు, మాజీ అధ్యక్షుడు దేవరశెట్టి శ్రీనివాసులు, వివిధ దేవాలయాల పాలక మండలి సభ్యులు, పాల్గొన్నారు.

## స్పార్క్ ఆఫ్ ది ఇయర్ గా సంజయ్ ఆచారి



**తిరుపతి విద్య, నవంబర్ 2 ప్రభాత వార్త:** స్థానిక ఎల్.ఐ.సి. రోడ్లోని ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం బి.కామ్, బి.ఎస్సీ,బి.బి.ఎ. బి.సి.ఎ.విద్యార్థులకు ఆంగ్లబాష సామర్థ్యాన్ని పెంచి ఉన్నత విద్య ఉపాది అవకాశాలను పెంపొందించాలని కాన్ఫ్యుయన్స్ పేరిట వినూత్న కార్యక్రమాన్ని నిర్వహిం చారు.ఈ కార్యక్రమములో ఫిక్షన్ డిక్షన్,టాక్ టాక్,లిజన్ అప్,ఇంక్రాఫ్ట్ తదితర పోటీలు నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమరాల్డ్స్ డైరెక్టర్లు విశ్వనాథ్,గిరిధర్లు విచ్చేసి,తమ విద్యా ర్థులు ఈ పోటీ ప్రపంచంలో ఉన్నతశిఖరాలను అధిరోహించడానికి ఇలాంటి పోటీలు నిర్వహి స్తునట్లు,ఇలాంటి కార్యక్రమాల్లో విద్యార్థులు తరచూ పాల్గొనాలని సూచిస్తు, నిర్వాహకులను అభినందించారు.అనంతరం జరిగిన ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతి ప్రధానం చేశారు.విజేతల వివరాలు టాక్ ది టాక్ లో యోగ విజ్ఞరాజ్ బి.సి.ఎ.ఫాహద్,అలీబి.బి.ఎ. ఫిక్షన్ డిక్షన్ లో సంజయ్ ఆచారిబి.బి.ఎ., రాహితిబి.కాం., ఇన్క్ క్రాఫ్ట్ లో శ్రీవంత్‌బి.బి.ఎ., జారా హబీబా బి.ఎస్సీ,లిజన్ అప్ లో మన్వితసాయిబి.సి.ఎ., శిరీషబి.ఎస్సీ లు ప్రథమ,ద్వితీయ స్థానాలు సాధించారు. ఈ పోటీలలో స్పార్క్ ఆఫ్ ది ఇయర్ గా సంజయ్ ఆచారి నిలిచాడు.ఈ కార్యక్రమములో అసిస్టెంట్ డైరెక్టర్ మునిరత్నం,జానకిరామ్,శ్రీనివాసులు,నాధముని,ప్రిన్సిపాల్ జాఫర్, అధ్యాపకురాలు వసుంధర,భానుశ్రీ, రమేష్,భానుకిరణ్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో మహారాష్ట్ర మంత్రి పూజలు



**శ్రీకాళహస్తి, నవంబర్ 2 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరా లయంలో ఆదివారం మహారాష్ట్రాకు చెందిన మంత్రి కుటుంబసభ్యులతో స్వామి అమ్మవార్లను దర్శించు కున్నారు. వాటర్ రీసోర్స్‌స్ మరియు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శాఖామాత్యులు గిరీష్ మహా జన్ రాగా వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద వేదపండితులతో ప్రోటోకాల్ ఎఇఓ మోహన్ వేదపండి తులతో స్వాగతం పలికారు. వారికి ఆలయ చరిత్రను వివరిస్తూ మరో ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. ఆలయ చరిత్ర నిర్మాణాలకు సంబంధించి మంత్రి అడిగి తెలుసుకున్నారు.వారికి మృతుయంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.ఏర్పాట్లను బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ సారధ్యంలో నిర్వహించారు. మంత్రికి ఘన స్వాగతం పలికారు. పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్,టెంపుల్ ఇన్స్‌పెక్టర్ వెంకటస్వామి, ఎపిఆర్ఓ రవిలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## నారారోహిత్ నూతన దంపతులకు గంగమ్మ ఆశీస్సులు



**చంద్రగిరి,నవంబర్ 2(ప్రభాతవార్త):** సినీనటుడు నారారోహిత్, శిరీష నూతన దంపతులకు తిరుపతి గ్రామదేవత తాతయ్య గుంట గంగమ్మ ఆశీర్వాదం అందజేశారు. ఆదివారం ఉదయం నూతన దంపతులను శాప్ ఛైర్మన్ రవి నాయుడు ఆధ్వర్యంలో నారావారిపల్లిలో గంగమ్మ గుడి ఛైర్మన్ మహేశ్‌యాదవ్, తెలుగుయువత నాయకుడు హేమంత్‌రాయల్, రంజిత్‌కుమార్, ప్రకాశ్, మధు,లోకేశ్ కలసి గంగమ్మ తీర్థప్రసాదాలను,అమ్మవారి ప్రతిమను బహుకరించారు. శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

# తిరుపతి డివిజన్

## నేడు డయల్ యువర్ ఏపిఎస్పీడిసిఎల్ సిఎండి



**తిరుపతిరూరల్, నవంబర్ 2 ప్రభాతవార్త:** విద్యుత్ వినియోగదారుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునే ప్రయత్నంలో ఏపిఎస్పీడిసిఎల్ నూతన ఆవిష్కరణకు శ్రీకారం చుట్టిందని ఆసంస్థ సిఎండి ఛైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి ఒక ప్రకటనలో తెలిపారు.ఏపిఎస్పీడిసిఎల్ కార్పోరేట్ కార్యాలయంలో ప్రతి సోమవారం డయల్ యువర్ ఏపిఎస్పీడిసిఎల్ సిఎండి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏపిఎస్పీడిసిఎల్ సంస్థ చరిత్రలో మొట్టమొదటిసారిగా డయల్ యువర్ సిఎండి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాని, విద్యుత్ వినియోగదారులు ఫోన్‌ఇన్ కార్యక్రమంలో పాల్గొని తమ సమస్యలను నివృత్తి చేసుకోవాలని కోరారు. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, వైయస్సార్ కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల వినియోగదారులు 8977716661 మొబైల్ నెంబర్‌కు కాల్ చేసి, తమ విద్యుత్ సమస్యను నేరుగా సిఎండికి తెలియజేసి, పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 10గంటల నుండి 12గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వినియోగదారులు మొబైల్ నెంబర్ 9133331912కు చాట్ చేసి, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చునని తెలిపారు.

## టివి మెకానికల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



**తిరుపతిరూరల్, నవంబర్ 2 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా టివి మెకానిక్ అసోసియేషన్ నూతన కార్యవ ర్గాన్ని ఎన్నుకున్నారు. న్యూబాలాజీ కాలనీలో ఉన్న యూత్ హాస్టల్‌లో టివి మెకానికల్ సర్వసభ్య సమా వేశం ఆదివారం జరిగింది. ఈ సర్వసభ్య సమావే శంలో జిల్లా అధ్యక్షుడుగా ముత్తు, ఉపాధ్యక్షులుగా రామకృష్ణ, జిల్లా కార్యధర్శిగా టి.ధనంజయులు, సంయూక్త కార్యధర్శిగా గిరి, కోశాధికారిగా నంసింహారెడ్డి, వివిఎస్ బాబును ఎన్నికయ్యారు. ఎన్నికైన మెకానిక్స్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. నూతన కార్యవర్గానికి బిజెపి నాయకులు గుండాల గోఫీనాథ్‌రెడ్డి ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సుబ్రమణ్యంరెడ్డి, రాజశేఖ ర్‌రెడ్డి, భాస్కరాచారి, బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

## స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫౌండేషన్ డేపై అవగాహన సదస్సు



**పుత్తూరు రూరల్, నవంబరు 2 ప్రభాతవార్త:** స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కార్యదర్శి ఆర్.నరసింహారావు ఆదేశాల మేరకు డిస్ట్రిక్ట్ చీఫ్ కమిషనర్, జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్.కుమార్ అనుమతితో ఘనంగా ఫౌండేషన్ డే నిర్వహించారు. తిరుపతి జిల్లాలో ప్రాంతాలవారిగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా పుత్తూరు, పరిసర ప్రాంతాల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్‌కి డివిజనల్ స్థాయి ట్రైనింగ్ సెంటర్‌లో ఫౌండేషన్ డే ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించి ఫ్లాగ్ డేను ప్రతి పాఠశాలలో నిర్వహించాల్సిందిగా మోటివేట్ చేయడం జరిగింది. కార్యక్రమంలో స్కౌట్ జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి విజయకుమార్, డిస్ట్రిక్ట్ ఆర్గనైజింగ్‌కమిషనర్ ఏ.వెంకటేశ్వరులు, స్కౌట్ మాస్టర్లు జయప్రకాష్,హరి, అశోక్‌కుమార్, జయకుమార్, రేంజర్ లీడర్స్ శైలజ, యువశ్రీ, మేఘన, బాలికల హైస్కూలు, మెయిన్ స్కూలు, పిల్లారిపట్టు జడ్పీ హైస్కూలు, గేటు పుత్తూరు జడ్పీ హైస్కూలు స్కౌట్ అండ్ గైడ్స్ పాల్గొన్నారు.

## తోపుడు బండ్ల వ్యాపారస్తులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి



**పుత్తూరు రూరల్, నవంబరు 2 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణంలో ఆదివారం సీఐటీయూ కార్యాల యం లో వాకర్స్ యూనియన్ కమిటీ సమావేశం నవీన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సీఐటీయూ యూనియన్ వాకర్స్ యూని యన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బుజ్జి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్ వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుత్తూరు పట్టణంలో తోపుడు బండ్ల వ్యాపారస్తులకు గుర్తింపు కార్డులు, అదే విధంగా వారికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పుత్తూరు మున్సిపాలిటీలో మాన్యువల్ ప్రకారంగా గేటు వసూలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు భద్రత కల్పించాలని అన్నారు. అనంతరం పుత్తూరు తోపుడు బండ్ల వ్యాపారస్తుల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. పుత్తూరు నూతన అధ్యక్షులుగా ఎం.నజీర్, నూతన ప్రధాన కార్యదర్శిగా ఎస్.నవీన్, కోశాధికారిగా కె.భువనేశ్వరి, ఉపాధ్యక్షులుగా ఎం.అంకయ్య, ఆర్.అజిత్, సహాయ కార్యదర్శులుగా ఎం.అనుబాబు, ఎం.తిరుమల య్య, కమిటీ సభ్యులుగా కె.హరి, గోపాల్, ఎస్.గురవమ్మ, వి.రాధను ఎన్నుకోవడం జరిగింది. కార్యక్రమంలో బిల్డింగ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు, కార్యదర్శి మునిరాజా, ఎన్.శ్రీనివాసులు, పుత్తూరు పట్టణ సీఐటీయూ కార్యదర్శి ఏ.విజయ్, నరసిం హులు, శివకుమార్ పాల్గొన్నారు.

## స్వామివారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



**వడమాలపేట, నవంబరు 2 ప్రభాతవార్త:** వడమా లపేట మండలం అప్పలాయగుంటలో అభయహస్తం తో వెలసిన ప్రసన్న వెంకటేశ్వర స్వామిని తెలంగాణ రాష్ట్ర హై కోర్టు న్యాయమూర్తి ఎన్.నరసింహారావు ఆదివారం దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రసన్న వెంకన్న దర్శనార్థం విచ్చేసిన న్యాయమూర్తికి అర్చ కులు, అధికారులు స్వాగతం పలికారు. ప్రసన్న వెంకటేశ్వర స్వామివారికి అర్చన చేసి మంగళ హారతులు ఇచ్చి, అర్చకులు ఆలయచరిత్రను వివరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారి వేణుగోపాల్, దర్శనం ఏర్పాట్లు చేశారు.

## రూ.25 కోట్లతో సిమెంటు రోడ్లు




**వడమాలపేట, నవంబరు 2 ప్రభాతవార్త:** ఏడాది న్నర కాలంలో వడమాలపేట మండలంలో సుమా రు రెండు కోట్లతో సిమెంటు రోడ్లు నిర్మించినట్లు నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తెలిపారు. మండలంలోని తిరుమణ్యం పంచాయతీలో టీఆర్ కండ్రిగ వెళ్లే రోడ్డులో సిమెంటు రోడ్డు దాత ఎంఆర్‌సీ రాజు పది లక్షల రూపాయలతో నిర్మించారు. అలాగే టీఆర్ కండ్రిగ గ్రామంలో 8 లక్షలు, అరుంధతివాడలో 8 లక్షల రూపాయలతో నిర్మించిన సిమెంటు రోడ్లును ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పుట్టిన ఊరును గుర్తు పెట్టుకుని తనవంతు సాయంగా అభివృద్ధి చేస్తున్న ఎంఆర్‌సీ రాజు కుటుంబం అందరికి ఆదర్శమన్నారు. అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్నానని, ఓర్వలేని వైసీపీ వారు కావాలనే చిచ్చుపెడుతు న్నారని విమర్శించారు. ప్రజలు ప్రతిక్షానికి కూడా అర్హుడువికావు అని తీర్పు ఇచ్చినా బుద్ధి రాలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు ధనంజయలునాయుడు, దాముయాదవ్, శివరాయల్, శ్రీధర్‌రాజు, జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, కుమార్, దేవా, గురునాథం, బాబు, గజేంద్ర, జ్యోతీశ్వర్, రమణా ఆచారి, చెంచుకృ ష్ణమరాజు, శివరాజు,పంచాయతీరాజ్‌డీఈ చంద్రశేఖర్, ఏఈ నాగేంద్ర, చైతన్య, వినోద్,శివ తదితరులు పాల్గొన్నారు.

## రైతు మోటార్లను దొంగలించిన వారిని అరెస్టు చేయాలి - సీపీఎం



**సత్యవేడు, నవంబరు 2 ప్రభాతవార్త:** సత్యవేడు మండలం మదనంబేడు గ్రామంలోని రైతుల వ్యవసాయ మోటార్లను దొంగలించిన దొంగలను అరెస్టు చేసి రైతులకు న్యాయం చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి దాసరి జనార్దన్ సత్యవేడు ప్రాంతీయ కార్యదర్శి వెలుగు రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం మదనంబేడు గ్రామంలో మోటార్లు పోయిన రైతులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మదనంబేడు రైతులు మాట్లాడుతూ తాము అప్పులు చేసి పంటలు పెట్టుకోవడం కోసం వ్యవసాయ విద్యుత్‌మోటార్లను తెలుగు గంగ కాలువపై ఏర్పాటు చేసుకుని వాటి ద్వారా వ్యవసాయం చేస్తూ బతుకుతున్నామని ఈ సందర్భంలో దొంగలు సుమారు 20 మోటార్లకు పైగా అపహరించుకుని వెళ్లారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.మోటార్ల దొంగతనంపై సత్యవేడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకున్న పాపాన పోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దొంగలపై కఠిన చర్యలు తీసుకుని ఉక్కుపాదం మోపాలని వారు డిమాండ్ చేశారు. పోలీసులు స్పందించకపోతే రైతులతోకలసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మదనంబేడు గ్రామంలోని రైతులు పాండ్య, వెంకటేష్ కుమారి, ఉష, ఎల్లయ్య, అమ్ములు, కాళప్ప, మునస్వామి, సోమయ్య, వసంతమ్మ, రామయ్య రాజు, ఏళుమలై, రోశయ్య, సెంథిల్, రాజేంద్రన్,హరి, రాబిన్ పాల్గొన్నారు.

## క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి : శంకర్‌రెడ్డి పిలుపు



**సత్యవేడు, నవంబరు 2 ప్రభాతవార్త:** యువతక్రీ డలపై ఆసక్తిపెంచుకోవాలని టీడీపీ ప్రోగ్రాం ఇన్‌చార్జి శంకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మహిళ క్రికెట్ వరల్డ్ మ్యాచ్ తిలకించేందుకు సత్యవేడు నియోజకవర్గ కేంద్రంలోని స్టేడియంలో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన యువతను ఉద్దేశించి మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవడం వాళ్ళ ఆరోగ్యంతో పాటు దేశ గౌరవం కాపాడేవాళ్లు అవుతారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోను మహిళల అభివృద్ధికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని,దానిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు నరేంద్ర, శివకుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, కోళ్ళ చిన్నా, కృష్ణయ్య, బాల మురళి పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరాలుగల విద్యార్థులకు దుస్తులు పంపిణీ




గూడూరు, నవంబర్ 2 ప్రభాతవార్త: లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వైజేపీ, టౌన్ వెస్ట్ క్లబ్స్ సేవ కార్యక్రమాలలో భాగంగా కీర్తిశేషులు లయన్ సూరబత్తిన సుబ్రహ్మణ్యం జన్మదినం సందర్భంగా 30 మంది ప్రత్యేక అవసరాలుగల దుస్తులు మరియు భోజనంను వారి కుటుంబ సభ్యులు గూడూరులోని డిఎస్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చీఫ్ గెస్ట్‌గా సూళ్లూరుపేట క్లబ్ సభ్యులు పాస్ట్ జోన్ చైర్మన్ ఆదిశేషారెడ్డి, వైస్ డిస్ట్రిక్ గవర్నర్ ఎంజేఫ్ లయన్ ఆర్‌వి రావులు విచ్చేసారు. ఈ కార్యక్రమంలో వైజేపీ క్లబ్ ప్రెసిడెంట్ లయన్ బి. సుధాకర్, టౌన్ క్లబ్ ప్రెసిడెంట్ లయన్ ఎం. శ్రీనివాస్ యాదవ్, వైజేపీ క్లబ్ సెక్రటరీ లయన్ డివి మురళి కృష్ణ, ట్రెజరర్ లయన్ పి. గోపినాథ్ రెడ్డి, క్లబ్ సభ్యులు పాస్ట్ జోన్ చైర్మన్ ఎంజెఎఫ్ లయన్ పి.మురళి నాయుడు, పాస్ట్ జోన్ చైర్మన్ ఎంజేఎఫ్ లయన్ వై. గురునాథం, ఇమ్మీడియేట్ పాస్ట్ ప్రెసిడెంట్ లయన్ పివి మనోజ్ కుమార్, పాస్ట్ ప్రెసిడెంట్ లయన్ ఎస్ఎల్ఎన్ స్వామి, పాస్ట్ ప్రెసిడెంట్ లయన్ ఎం.మురళి రాజు, లయన్ పి.శివరాం, లయన్ పి.రాజేంద్ర ప్రసాద్, లయన్ వై.వేణురెడ్డి, లయన్ ఎస్‌కె ఇంతియాజ్, లయన్ లేడీ ఐ.కావేరి, లయన్ లేడీ ఆర్. ప్రభావతి, లయన్ లేడీ బి.వాణి,సూళ్లూరుపేట క్లబ్ సభ్యులు పాస్ట్ ప్రెసిడెంట్ లయన్ అప్పారావు, లయన్ గల్లా.సురేష్, దివ్యాంగుల ప్రెసిడెంట్ జనా సుధీర్‌లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసారు.

# గూడూరు డివిజన్

## అందరూ సుఖ సంతోషాలతో ఉండాలి : యాచేంద్ర



వెంకటగిరి, నవంబర్ 2 ప్రభాతవార్త: ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వివి సాయి కృష్ణ యాచేంద్ర, వెంకటగిరి యువరాజు సర్వజ్ఞ కుమార యాచేంద్ర జన్మదిన సందర్భంగా ఆయన అభిమానులు ఏర్పాటు చేసిన కేక్ కటింగ్, అన్నదానం కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని మేము ఎప్పుడు కోరుకుంటామని తెలిపారు. ప్రజల కోసం తాము ఎన్నో సేవలు చేశామని చెప్పారు. సర్వజ్ఞ కుమార యాచేంద్ర ఇలాంటి జన్మదినాలు ఎన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఢిల్లీ బాబు, ఎంఎ నారాయణ, ధనియాల రాధ, వహీదా, నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## షార్‌లో సంబరాలు... హుషారు



సూళ్లూరుపేట, నవంబర్ 2 ప్రభాతవార్త: ఎల్‌విఎం3-ఎం5 రాకెట్ విజయంతో శ్రీహరికోటలో ఆదివారం ఇటు ఉద్యోగులు, అటు ప్రయోగాన్ని వీక్షించేందుకు వచ్చిన ప్రేక్షకులు, విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. కౌంట్‌డౌన్ సమయం ముగిసిన వెంటనే అంతరిక్షంలోకి నిప్పులు చెరుగుతూ దూసుకెళుతున్న రాకెట్‌ను చూసి చిన్నాపెద్దా తారతమ్యం లేకుండా కేరింతలు కొట్టారు. విజయం సంపూర్ణం కావడంతో ఒకరినొకరు అభినందనలు తెలుపుకుంటూ ఆలింగనాలు చేసుకుని ఉత్సాహంగా సంబరాలు చేసుకున్నారు.

**ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అభినందనలు:**

ఇస్రో సాధించిన విజయం పట్ల సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. భారతదేశ అంతరిక్ష చరిత్రలో చారిత్రాత్మక ఘట్టంగా ఆమె అభివర్ణించారు. ఇస్రో మరెన్నో మైలురాళ్లను అధిగమించి ప్రపంచ అంతరిక్ష రంగంలో తిరుగులేని శక్తిగా రూపుదిద్దుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

## మున్సిపల్ మహిళా కార్మికురాలికి సన్మానం



గూడూరు, నవంబర్ 2 ప్రభాతవార్త: మున్సిపాలిటీలో ఎన్నో సంవత్సరాలుగా ఔట్ సోర్సింగ్ పారిశుద్ధ్య మహిళా కార్మికురాలుగా ఐదవ సచివాలయం పరిధిలో విధులు నిర్వహిస్తున్న మందా రామమ్మ అక్టోబరు 31 తేదీన పదవి విరమణ కావడంతో ఏ.పీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సి.ఐ.టి.యు) అనుబంధం ఆధ్వర్యంలో తోటి పారిశుద్ధ్య కార్మికులు అందరూ కలిసికట్టుగా ఆదివారం స్థానిక సి.ఐ.టి.యు కార్యాలయంలో సన్మాన సభను భూలోక మురళి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గూడూరు మున్సిపల్ కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు జోగి. శివకుమార్, ముఖ్య అతిథులుగా ఏ.పీ. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దారా. కోటేశ్వరరావు, వడ్డిపల్లి చెంగయ్య విచ్చేసారు. ఈ కార్యక్రమంలో గూడూరు పట్టణ సి.ఐ.టి.యు ప్రధాన కార్యదర్శి బి.వి.రమణయ్య, గూడూరు మున్సిపల్ కార్మిక సంఘం సహాయ అధ్యక్షులు యన్. వెంకటరమణ, సహాయ కార్యదర్శి ఏ.శాంతి వర్ధన్, జి.మని, పి.పి పెంచల ప్రసాద్, శ్రీనివాసులు, మహిళా కార్మికులు పద్మమ్మ, నారాయణమ్మ, పెంచలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ సేవా సంఘంచే రుద్రాభిషేకం



గూడూరు, నవంబర్ 2 ప్రభాతవార్త: రెండో పట్టణ పరిధిలోని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య కళ్యాణ మండపంలో కార్తీకమాసం సందర్భంగా రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. సంఘ సభ్యులు బ్రాహ్మణులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గూడూరు రెండో పట్టణ పరిధిలో ఉన్న ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య కళ్యాణ మండపంలో కార్తీక మాసం ద్వాదశి సందర్భంగా రిటైర్డ్ టీచర్ రాష్ట్ర ప్రభుత్వ అవార్డు గ్రహీత ఆలూరు శిరోమణి శర్మ ఆధ్వర్యంలో మహా శివునికి రుద్రాభిషేకం మహా శివునికి రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు శివకుమార్, కడివేటి రామ్మూర్తి, ఊద్యా లలిత, చిట్టమూరు శ్రీనివాసరావు, పురుషోత్తం రావు, డిబి శ్రీనివాసరావు, నరసింహారావు, వెంకటేశ్వరరావు, చెన్నూరు విద్యావతి, అనిమెళ్ళ రాజేశ్వరి దేవి, శ్రీనివాస్ కుమార్, అశోక్ కుమార్, నారాయణమూర్తి, వెంకట సుబ్బారావు, రాజా నారాయణ, చైతన్య ప్రసాద్, వంశీకృష్ణ, ప్రసన్న కుమార్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఉపాధ్యాయులకు ఆత్మీయ అభినందన



వాకాడు, నవంబర్ 2 ప్రభాతవార్త: శ్రీ సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం గ్రామంలోని ఆదివారం శ్రీ పట్టాభిరామాలయంలో డీఎస్సీ 2025లో ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి ఆత్మీయ అభినందన పూర్వక సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆలయ ధర్మకర్త కొడవలూరు దామోదరరెడ్డి చేతుల మీదుగా నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామసేన అధ్యక్ష కార్యదర్శులు కొడవలూరు హరీష్ రెడ్డ, పోలిపాటి శివకుమార్, వంశీ, శేఖర్, వినయ్, మోహన్, తేజ, రాజేష్ సంస్థ ప్రతినిధులు కోన సాయిబాబు, దీవి అనంతాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## బాధితులను ఆదుకోండి



వాకాడు, నవంబర్ 2 ప్రభాతవార్త : మండలంలోని తూపిలిపాలెం సముద్రం సముద్రం ఒడున్న నివసిస్తున్న బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని అమ్మ ఫౌండేషన్ అధ్యక్షురాలు స్వప్న సూచించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తూపిలిపాలెం సముద్రం ఒడ్డున 9 గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయని, వీరిని పట్టించుకుని దాఖలు ఇప్పటివరకు లేవని ఆమె తెలిపారు, ఫౌండేషన్ ద్వారా వీరికి మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులు గుర్తించి గిరిజనలకు ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాలు వచ్చేలా చేయాలని ఆమె ప్రభుత్వ అధికారులను కోరారు.

## నేరాల నియంత్రణ కోసం తనిఖీలు: సీఐ



వెంకటగిరి, నవంబర్ 2 ప్రభాతవార్త: నేరాల నియంత్రణ కోసమే తరచూ కార్డన్ అండ్ సర్చ్ నిర్వహిస్తున్నట్లు సిఐ ఏవి రమణ తెలిపారు. వెంకటగిరి పట్టణం టిడ్కో గృహాల సముదాయంలో వెంకటగిరి గృహాల సముదాయంలో వెంకటగిరి డక్కలి, బాలాయపల్లి, డక్కలి మండలాల పోలీసులు కార్డినెట్ సెర్చ్ నిర్వహించారు. జగనన్న గృహాల వద్ద కొత్తవారు వస్తున్నందున తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు ఏడుకొండలు, కామినేని గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

## చెరువు గండి తక్షణమే పూడిచాం : చంద్రమౌళి రెడ్డి



వెంకటగిరి, నవంబర్ 2 ప్రభాతవార్త: మండలంలోని లాలాపేట చెరువు వద్ద మూడు గండ్లను వెంటనే పూడిపించామని మండల టిడిపి అధ్యక్షులు పప్పు చంద్రమౌళి రెడ్డి తెలిపారు. చెరువుకు పడ్డ గండ్ల ద్వారా నీరు పోకుండా తక్షణం కూర్చున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సూచన మేరకు గళ్ళను సూచన మేరకు గండ్లను పూజించినట్లు తెలిపారు. గండ్లను పూడ్చడం వల్ల రైతులు ఎమ్మెల్యే రామకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. గండ్లను ఏఎంసి చైర్మన్ విశ్వనాథం, సొసైటీ అధ్యక్షులు వెంకట ముని, నాయకులు సత్యనారాయణ, ఆనంద్, తదితరులు పరిశీలించారు.

## తన స్థలంలో దౌర్జన్యంగా ఇంటిని నిర్మించారు



వెంకటగిరి, నవంబర్ 2 ప్రభాతవార్త: తనకు సంబంధించిన స్థలంలో భాగ్యరాజ్ కుటుంబ సభ్యులు దౌర్జన్యంగా ఇంటిని నిర్మించాలని అరవ సునీత పోలీసులకు ఫిర్యాదు చేశారు. మాసాపేటలో తనకు చెందిన స్థలాన్ని, తమ కుటుంబానికి చెందిందంటూ భాగ్యరాజ్ కుటుంబ సభ్యులు నాపై దౌర్జన్యం చేసి, దాడి చేశారని ఆమె వాపోయారు. ఆ స్థలానికి సంభందించిన అన్ని రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఆధారాలు నాకు ఉన్నాయని, నా స్థలంలోకి నేను వెళుతుంటే, నన్ను రానీకుండా అడ్డుకుని దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించింది. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఫలితం లేదని, నా స్థలంలో భాగ్యరాజ్ కుటుంబ సభ్యులు అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. తనకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌లకు ఫిర్యాదు చేసింది.

## సిఐటియు మహాసభలను జయప్రదం చేయండి




గూడూరు, నవంబర్ 2 ప్రభాతవార్త: సిఐటియు అఖిల భారత 18వ మహాసభలు 2025 డిసెంబర్ 31, 2026 జనవరి 4 తేదీ వరకు విశాఖపట్నంలో జరుగునున్న మహాసభలను జయప్రదం చేయాలని తిరుపతి జిల్లా గూడూరు లోని భవన నిర్మాణ కార్మిక సంఘం భవనం కార్యాలయంలో ఆదివారం జరిగిన కమిటి సభ్యులు సమావేశంలో అధ్యక్షులు ఎస్.డి.రఫీ పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు జోగి శివకుమార్ హాజరైయ్యారు. అనంతరం సిఐటియు అఖిల భారత మహాసభలు కరపత్రాలు విడుదల చేయడం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన గూడూరులోని భవనం కార్యాలయంలో జరగనున్న భవన నిర్మాణ కార్మిక సంఘం జనరల్ బాడీ సమావేశం నిర్వహించడం జరుగుతుందని ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సేలం సేకరాచారి, సిఐటియు గూడూరు పట్టణ ప్రధాన కార్యదర్శి బి.వి.రమణయ్య, సీనియర్ నాయకులు గండికోట మధు, ఖాదర్ బాషా, రత్నం, కాసిం, కువైట్ బాబు, ఓజిలి బాషా తదితరులు పాల్గొన్నారు.

## కాశీబుగ్గ విషాదం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం

శ్రీసిటీ (తడ), నవంబర్ 2 ప్రభాతవార్త : కాశీబుగ్గ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటన ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు బోలింగాలపాడు జయకుమార్‌రెడ్డి ఆరోపించారు.ఆదివారం తడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు పాలనలో భక్తుల ప్రాణాలు సురక్షితంగా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి పాలనలో అపచారాలు, దుర్ఘటనలు రోజువారీ వ్యవహారంగా మారాయని, ప్రజల ప్రాణాల కంటే ప్రచారమే ముఖ్యమని ఈ ప్రభుత్వం నిరూపించిందని బోలింగాలపాడు జయకుమార్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు.

## ఇస్రో శాస్త్రవేత్తలకు శ్రీసిటీ ఎండీ అభినందనలు



శ్రీసిటీ (తడ), నవంబర్ 2 ప్రభాతవార్త: ఎల్వీఎం3ఎం5 రాకెట్ ప్రయోగం విజయవంతం అయినందుకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి హర్షం వెలిబుచ్చారు. ఈ ప్రయోగం ద్వారా సిఎంఎస్03 (జిశాట్ 7ఆర్) ఉపగ్రహాన్ని నిర్ణీత కక్ష్యలోకి పంపడంలో ఘన విజయం సాధించినందుకు, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) అధ్యక్షులు డా. వి. నారాయణన్‌కు, షార్ డైరక్టర్ ఈ.ఎస్. పద్మకుమార్‌కు, షార్ శాస్త్రవేత్తలకు, ఇతర ఉద్యోగస్థులకు అభినందనలు తెలిపారు. ఇంతవరకు ప్రయోగించిన ఉపగ్రహాల్లో ఇదే అత్యంత బరువైనదని ఆయన పేర్కొంటూ, భారత నౌకా దళానికి, కమ్యూనికేషన్స్ పరంగా ఇది కొత్త శక్తిని అందించగలదని, తద్వారా హిందూ మహాసముద్రంలో రక్షణ వ్యవస్థ మరింత పటిష్టమవుతుందని ప్రశంసలు కురిపించారు.

## దక్షిణ భారత సంస్కృతీ సంప్రదాయాలను గౌరవిద్దాం..!

**-భారతీయ వికాస్ పరిషత్ జాతీయ కార్యదర్శి డి.డి.శర్మ**




రామచంద్రాపురం, నవంబర్ 2 ప్రభాతవార్త: దక్షిణ భారతదేశ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని భారత్ వికాస్ పరిషత్ జాతీయ కార్యదర్శి డి.డి.శర్మ అన్నారు. ఆదివారం వెంకట్రామాపురం సమీపం లోని సెవెన్ హిల్స్ ఫార్మశీ కళాశాలలో భారత్ వికాస్ పరిషత్ దక్షిణ భారత దేశంలో సాంస్కృతిక పోటీలను జ్యోతి ప్రజ్వలన గావించి, ప్రారంభించారు. ఈ స ందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీదేశ సంప్రదాయాలకు ప్రపంచంలోనే అత్యంత గౌరవమన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలను బావితరాలకు అందించడానికి కృషి చేయాలన్నారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ విద్యాపీఠం విసి ప్రొఫెసర్ జిఎస్ఆర్ కృష్ణమూర్తి, శ్రీవెంకటేశ్వ వేదవిశ్వవిద్యాలయం విసి రాణీసదాశివమూర్తి, కళాశాల ప్రిన్సిపాల్, బివిపి తిరుపతి ప్రాంత అధ్యక్షుడు డాక్టర్ నిరంజన్ బాబు, ఎస్వీ ఆయుర్వేద మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రేణుదీక్షిత్, బివిపి రీజినల్ కార్యదర్శి పురుషోత్తం శాస్త్రి, జనరల్ సెక్రటరీ అవిలాల శ్రీదర్ పిళ్ళై, ఫైనాన్స్ కార్యదర్శి సుంకు వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా

**-మాజీ మంత్రి రోజాచే కోటి సంతకాల సేకరణ**



విజయపురం, నవంబరు 2 ప్రభాతవార్త: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాజీ మంత్రి రోజా మండలంలోని ఇళ్ళత్తూరులో ఆదివారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోజా మాట్లా డుతూ వైసీపీ హయాంలో రాష్ట్రానికి 17 మెడికల్ కాలేజీలు ఆమోదించబడ్డాయని, వాటిలో ఏడు మెడికల్ కాలేజీలు పూర్తిగా నిర్మాణం జరిగిందని, 10 కాలేజీలు పెండింగ్ నిలిచిందన్నారు. ప్రైవేటీకరణ వలన కలిగే నష్టాలను వివరించారు. కూటమి ప్రభుత్వం తీరు ఇలానే ఉంటే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మంజు బాలాజీ, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం వైసీపీ విభాగం ఉపాధ్యక్షుడు గోవర్ధన్‌నాయుడు, మండల వైసీపీ అధ్యక్షుడు శివరాజు, నాయకులు శేఖర్‌రాజు, గుణశేఖర్‌రెడ్డి, గోపిరాజు,సుబ్బు యాదవ్, నారపరాజు పాల్గొన్నారు.

## ప్రపంచకప్ ఫైనల్‌కు చేరిన సందర్భంగా సంబరాలు



శ్రీకాళహస్తి,నవంబర్ 2 ప్రభాతవార్త: భారత దేశం గర్వించే విధంగా ఇండియా సౌత్ ఆఫ్రికా మహిళల ప్రపంచ కప్‌లో ఫైనల్‌కు చేరిన సందర్భంగా తెలుగుదేశం పార్టీ ఆదేశానుసారం శ్రీకాళహస్తి పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్ సారథ్యంలో సంబరాలు జరుపుకున్నారు. భారత దేశం గర్వించదగిన రీతిలో మహిళల ప్రపంచ కప్ పోటీల్లో భారత దేశానికి చెందిన క్రీడాకారులు ఫైనల్‌కు చేరుకున్నారన్నారు. కోట్లాది భారత దేశ ప్రజల ఆశలకు క్రీడాకారులు జీవం పోసారన్నారు. ఆదివారం ముంబాయిలో జరిగిన ఫైనల్‌లో భారత దేశం విజయం సాధించి ప్రపంచ క్రీడా జగతిలో స్థానం సాధించాలని గ్రామ దేవత శీతలాంబ ఆలయం వద్ద పూజలుజరిపారు. సంబరాలు జరుపుకున్నారు.

# అంచనాలకు మించి భక్తుల రద్దీ -దర్శనానికి నాలుగైదు గంటలు



కాణిపాకం, నవంబర్ 2 ప్రభాతవార్త: సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామి అలయ దర్శనార్థం అంచనాలకు మించి అశేషంగా తరలివస్తున్న భక్తులతో ఆదివారం భక్తుల రద్దీతో పోటెత్తింది. సాధారణంగా ఆలయంలో శని, ఆది వారాలు, వారాంతపు సెలవు రోజుల్లో తీవ్రస్థాయిలో రద్దీవుం టుంది. ఈమేరకు ఆదివారం ప్రభుత్వ సెలవు దినం కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో పాటు తిరుమల వెళ్ళే భక్తులు కూడా కాణిపాకం ఆలయ దర్శనానికి భారీగా తరలి రావడంతో ఉదయం నుండి ఆలయంలోని క్యూలైన్లన్ని భక్తులతో పోటెత్తింది. రద్దీ కారణంగా ఆలయంలోని క్యూలైన్లుతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు.అలాగే ఆలయ మాడా వీధులు, పరిసరాలన్ని కిక్కిరిసిపోయాయి. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లలో సుమారు నాలుగు గంటలకు పైగా వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. దీనితో భక్తులకు త్వరితగతిన స్వామిదర్శనం కల్పించేందుకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఇదిలా వుండగా కాణిపాకం ఆలయ దర్శనార్థం అశేషంగా తరలివచ్చిన భక్తుల వాహనాలతో పార్కింగ్ స్థలాలన్ని కిటకిటలాడాయి. పార్కింగ్ స్థలాలు నిండిపోవడంతో కాణిపాకం పరిసర గ్రామాల వద్ద పార్కింగ్ చేసుకోవాల్సి వచ్చింది.ఆదివారం సుమారు 30 వేల మందికి పైగా భక్తులు స్వామివారిని

## వైభవంగా కార్తీక బ్రహ్మోత్సవాలు



నారాయణవనం, నవంబర్ 2 ప్రభాతవార్త : మండల కేంద్రంలోని నారాయణ వనంలో ప్రసిద్ది చెందిన పద్మావతీదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నది. ఉత్సవాల్లో రెండవ రోజు ఆదివారం ఉదయం అమ్మవారిని సుప్రభాతసేవలతో మేల్కొలిపి, వివిధ రకాల సుగంధద్రవ్యాలతో అభిషేకం చేసిన తర్వాత స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అమ్మవారిని అలంకరించారు.

**తెప్పపై విహరించిన ఆండాల్ అమ్మవారు :**

నారాయణవనంలో ప్రారంభమైనా కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు ఆండాల్ అమ్మవారు ఆదివారం రాత్రి తెప్పపై ఘనంగా ఊరేగారు. అంతకుముందు అమ్మవారిని తిరుచ్చివాహనంపై పుర వీధుల్లో ఘనంగా ఊరేగించారు. పుష్కరిణిలో అమ్మవారిని మూడు చుట్టులు తిప్పారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితం ఇన్‌పెక్టర్ భరత్, అర్చకులు శ్రీధర్‌భట్టాచార్యులు, శ్రీనివాస భట్టాచార్య, నరసింహరాఘవ భట్టాచార్యులు, భక్తులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో రైతు మృతి!



పెద్దపంజాణి, నవంబర్ 2 ప్రభాతవార్త : మండలంలోని నెలపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి ఓ రైతు పొలం వద్ద మృతి చెందాడు. ఈసంఘటనకు సంబంధించి స్థానికుల కథనం మేరకు వివరాలిలా.. గ్రామానికి చెందిన నారాయణప్ప కుమారుడు హరిబాబు(36) తన కుటుంబంతో కలసి వ్యవసాయం చేసుకుని జీవించేవాడు. ఆదివారం ఉదయం తమ పొలాల వద్ద సాగుచేస్తున్న వరి పంటకు నీరు పెట్టేందుకు అని పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ బోరు మోటారుకు ఏర్పాటుచేసిన స్టార్టర్‌ను ఆన్ చేయగా ఒక్కసారిగా అతనికి విద్యుత్ షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు. కాగా మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు కలరు. హరిబాబు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## పొంచి ఉన్న ప్రమాదం...చోద్యం చూస్తున్న అధికారులు



రేణిగుంట, నవంబర్ 2 ప్రభాతవార్త: రేణిగుంట మండలం పూతలపట్టు నాయుడుపేట జాతీయ రహదారి పక్కన పాపానాయుడు పేట వైపుకు వెళ్లడానికి వెళ్లే సర్వీస్ రోడ్డు వద్ద నిర్మించిన గోడ వల్ల ఎన్నో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. గోడను తమ స్థలంలోని కట్టామని స్థలం యజమానులు అంటున్నారు. ఇంతకు గోడ ప్రభుత్వ స్థలంలో ఉందా లేక ప్రైవేటు వ్యక్తుల స్థలంలో ఉందా అనే విషయాన్ని అధికారులు నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉంది. పొరపాటున ఏదైనా వాహనం టర్నింగ్ తిప్పుబోయి గోడను ఢీకొంటే పెద్ద ప్రమాదంతో పాటు అపార ప్రాణ నష్టం జరిగే అవకాశం లేకపోలేదు. గతంలో ఇక్కడే ఓ విద్యా సంస్థ భవనాలను గోడను నిర్మించింది. అయితే అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం పాపానాయుడు పేటకు రోడ్డు వెయ్యాలన్న దృఢ సంకల్పంతో ప్రజా ప్రయోజనార్థం గోడను పూర్తిగా తొలగించి రాకపోకలకు అనుకూలంగా డబల్ రోడ్డును నిర్మించారు. అదే రోడ్డు పక్కన తమ స్థలం అంటూ కొందరు ప్రైవేటు వ్యక్తులు రోడ్డు క్రాసింగ్‌లో గోడను నిర్మించారు. ప్రస్తుతం ఇక్కడ కూడా ఏదైనా ప్రమాదం జరిగే వరకు అధికారులు స్పందించరేమో అన్న విమర్శలు అధికంగా వినిపిస్తున్నాయి.

## మూషికవాహనంపై శ్రీ సిద్ది బుద్ధి వినాయక స్వామి



చంద్రగిరి, నవంబర్ 2 ప్రభాతవార్త: స్వర్ణముఖీ నదీతీరాన వెలసియున్న శ్రీఅగస్త్యేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదివారం శ్రీసిద్ది బుద్ధి సమేత వినాయక స్వామి వారు మూషిక వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. తొండవాడ అగస్త్యేశ్వర స్వామి వారి ఆలయంలో కార్తీక మాసం ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రాత్రి శ్రీ సిద్ది బుద్ధి వినాయక స్వామి వారి ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణలు గావించి మూషిక వాహనంపై అధిష్టింపజేసి ఆలయ ప్రదక్షిణలు గావించారు. ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆకాశదీపం



శ్రీకాళహస్తి,నవంబర్ 2 ప్రభాతవార్త: కార్తీక మాసం సందర్భంగా ఆ దివారం శ్రీకాళహస్తీశ్వరాలయం ఆకాశదీపాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నేపధ్యంలో ప్రతి రోజూ కోట మండపం వద్ద ఏర్పాటు చేసిన స్థంభంపై నేతి దీపాలను వెలిగించటం జరుగుతుంది. ఆదివారం ఆలయంలో భక్తులతో కిట కిట లాడింది. ఈ నేపథ్యంలో సాయంత్రం ఆకాశ దీపాన్ని ఆలయ ఎఇఒ విద్యా సాగర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఏర్పాట్లను పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్ పర్యవేక్షించారు. ఆలయ పోరోహితులు అర్ధగిరి వేద మంత్రాలను పఠిస్తుండగా ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి ఆకాశదీపాన్ని ఆవిష్కరించారు.

## శ్రీవారిని దర్శించుకున్న... నారా రోహిత్ నూతన దంపతులు



తిరుమల,నవంబర్ 2ప్రభాతవార్తప్రతినిధి: వివాహమైన తరువాత సినీనటుడు నారారోహిత్ నూతన దంపతులు ఆదివారం ఉదయం తిరుమలకు చేరుకుని కులదైవాన్ని దర్శనం చేసుకున్నారు. స్వామివారి ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## భారత్ గెలుపు ఆనందాన్ని ఇచ్చింది : ఎమ్మెల్యే ఆరణి



తిరుపతి విద్య, నవంబర్ 2 ప్రభాతవార్త: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళల వన్డే ప్రపంచ క్రికెట్ ఫైనల్ మ్యాచ్ కచ్చాపి ఆడిటోరి యంలో ఎల్ ఈ డి స్క్రీన్‌పై ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఈ మ్యాచ్‌ను తిలకిం చేందుకు క్రీడాకారులతో పాటు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరైయ్యారు. మ్యాచ్‌కు వర్షం అడ్డంకిగా మారడంతో ఆలస్యంగా ప్రారంభమైంది. శ్రీవారి ఆశీస్సులతో మహిళల వన్డే ప్రపంచ కప్‌ను భారత్ క్రికెట్ జట్టు గెలించిందని వ్యక్తం చేశారు. రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనాయకులు నారా లోకేష్‌లు ప్రభుత్వ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటాను రెండు నుంచి మూడు శాతానికి పెంచారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ విజయ్, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్పర్సన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణా, కార్పొరేటర్ నరసింహాచారి, ఎస్సీ కార్పొరేషన్ సభ్యురాలు కుమారమ్మ తదితరులు పాల్గొన్నారు.